


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 25.11.2025 | సంపుటి : 2 | సంచిక :291 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thuesday | 25.11.2025 | volume : 2 | Issue : 291 | Pages : 8 | Cost : 2/- |




# ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

## ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు

**భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు.**

న్యూఢిల్లీ, నవంబరు 24 : 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో

- మిగతా 2 లో..


# ప్రజల అండతోనే అభివృద్ధి

## అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్


- కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్
- పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి
- గతంలో ఎవరు సిఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- కొడంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి

**కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.**



కొడంగల్, నవంబరు 24 : జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలి. కొడంగల్‌లో రూ. 5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయ- ంబోతున్నాం. 16 నెలల్లోగా

- మిగతా 2 లో..



02

## నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరించనున్న మోడీ



## 15 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 15 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్

- మిగతా 2 లో..

## 5 రోజుల కస్టడీలో కీలక సమాచారం

ముగిసిన ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ..

చంచల్‌గూడ జైలుకు తరలింపు




హైదరాబాద్, నవంబరు 24 : ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ ముగిసింది. 5 రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. రవి వెబ్ సైట్, డొమైన్ నెట్ వర్క్, ఐపీ మాస్క్‌లతో పాటు అన్నింటిపై పోలీసులు ఆరా తీశారు. 20 కోట్ల రూపాయల లావాదేవీలపై బ్యాంకు అధికారుల సహకారంతో బదిలీ వివరాలు తెప్పించుకుని మరీ పోలీసులు రవిని ప్రశ్నించారు. రవి

- మిగతా 2 లో..

# జీహెచ్‌ఎంసీ పోరుకు రెడీగా ఉండండి

## కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై పోరాడాలి

### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం

**జీహెచ్‌ఎంసీ ఎన్నికలు ఎప్పుడు పెట్టినా సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. అలాగే మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో బల్దియాలోని సమస్యలు ప్రస్తావించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక భూముల అమ్మకంపై నిలదీయాలని సూచించారు.**



హైదరాబాద్, నవంబర్ 24 : గ్రేటర్ హైదరాబాద్ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులతో తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. మంగళవారం జరుగనున్న

- మిగతా 2 లో..



# కోకాపేటలో ప్లాట్లకు రికార్డు ధర

## ఎకరం 137.25కోట్లు

### గత రికార్డులు తిరగరాసిన వైనం

హైదరాబాద్, నవంబరు 24 : హైదరాబాద్ కోకాపేటలో ప్లాట్లు రికార్డు ధర పలికాయి. నియోపోలిస్ దగ్గర రికార్డు స్థాయిలో ప్లాట్లు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. ఎకరం ధర రూ.137.25 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. గత రికార్డులను ఇది తిరగరాసింది. అధికారులు ప్లాట్ నెంబర్ 17, 18కి ఈ వేలం

- మిగతా 2 లో..



## నిరంజన్ రెడ్డి అవినీతి పరుడు

ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని పార్టీకి చెడ్డపేరు

02

మాజీమంత్రిపై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్

# మహిళా స్వయం సహాయక సంఘాలకు ₹304కోట్లు

## సంఘాలకు ప్రభుత్వం శుభవార్త

### అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, నవంబరు 24 : రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు

- మిగతా 2 లో..





# ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల కల్పనకు కృషి

- వసతుల కల్పనకు కేంద్రం చర్యలు
- సక్రమంగా వినియోగించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- జమ్మికుంటలో ఆధునిక వైద్య పరికరాలు ప్రారంభం

కరీంనగర్, నవంబరు 24 : పేద ప్రజలు అత్యవసర చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను విశ్వసించి వస్తారని, ఆ నమ్మకాన్ని పెంపొందించే దిశలో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం

- మిగతా 2 లో..

# నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన



**అయోధ్య, నవంబరు 24 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం అయోధ్యలో పర్యటించనున్నారు. ఇక్కడి రామ జన్మభూమి మందిర్‌ను దర్శించనున్నారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక- సాంస్కృతిక -ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల తొమ్మిదవ గురువు గురు తేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటల సేపు ధ్యానం చేశారు. ప్రధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు. 11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరాలను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృహంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు. రామమందిరానికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్టు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు

# జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

గ్రేటర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు వివిధ అంశాలపై కేటీఆర్ మార్గదర్శనం చేశారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ఎలాంటి అవినీతికి తావు లేకుండా అద్భుతంగా పదవీకాలం పూర్తి చేసుకోబోతున్నారని పార్టీ తరపున వారికి అభినందనలు తెలిపారు. ముఖ్యంగా రెండోసారి జీహెచ్‌ఎంసీలో గెలిచిన తర్వాత కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతమైన సేవలను అందించిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రజలు పార్టీకి ప్రతిపక్షంగా బాధ్యత ఇచ్చిన తర్వాత హైదరాబాద్ నగరంలో ఉన్న కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తీరును అభినందించారు. మొన్నటికి మొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్పొరేటర్లు బాధ్యతాయుతంగా ఎన్నికలను పోరాడిన విధానంపై అభినందనలు తెలిపారు. పార్టీ వెంటే నిలబడిన ప్రతి ఒక్క కార్పొరేటర్‌కి భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు భవిష్యత్తులో జరిగే ఎన్నికను తమ ఎన్నికగా తీసుకొని పార్టీ అందరినీ తిరిగి గెలిపించుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్లకి రానున్న కాలంలో మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.



# నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, నవంబరు 24 :** బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి చేసిన అవినీతికి వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బపడిందని వ్యాఖ్యలు చేశారు. ఆయన మూడు నాలుగు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని.. చెప్ప లేనంత అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మార్వో ఆఫీస్‌ను కాల్చేస్తే కూడా ప్రజలు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని.. ఎదురు తిరిగిన 32 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారంటూ మాజీ మంత్రిపై ఫైర్ అయ్యారు. ఇలాంటి అవినీతిపరుడిని చిత్తుగా ఓడించడం సరైన నిర్ణయమన్నారు. వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డి రాచరిక పాలనను తలపించారని విమర్శించారు. ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వని నిరంజన్ రెడ్డి తనకు తాను నీళ్ల నిరంజనుడుగా పేరు మార్చుకున్నారంటూ ఎద్దేవా చేశారు. 'నా గురించి ఇంకొక్కసారి ఎక్కడైనా మాట్లాడితే నీ తాట తీస్తా ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకో' అంటూ నిరంజన్ రెడ్డికి కవిత ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

# ఎకరం రూ.137.25 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. అధికారిక సమాచారం ప్రకారం.. ప్లాట్ నెం. 17లో 4.59 ఎకరాలు ఉండగా ఈ వేలంలో ఎకరానికి రూ. 136.50 కోట్లు పలికింది. ప్లాట్ నెం 18లో 5.31 ఎకరాలు ఉండగా ఎకరానికి రూ.137.25 కోట్లు పలికింది. వేలంలో 9.90 ఎకరాలకుగాను ఊఓఆంకి రూ.1,355.33 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. కోకాపేటలో మిగిలిన భూములను నవంబర్ 28వ తేదీన అధికారులు వేలం వేయనున్నారు. కాగా, నియోపోలీస్ లేఅవుట్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో దిగ్గజ రియల్ ఎస్టేట్ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడుతున్నాయి. అంతేకాకుండా, ఇక్కడ ఎన్ని అంతస్తులు నిర్మించాలన్నదానిపై పరిమితి కూడా లేదని తెలుస్తోంది. ఫ్లోర్స్ విషయంలో లిమిట్ లేకపోవడంతో కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు నిర్మించుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ అటు ఓఆర్ఆర్‌కు ఇటు రాయదుర్గం ఐటి కంపెనీలకు దగ్గరగా ఉండటంతో కోకాపేట భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

# అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి" అని రేవంత్ పిలుపునిచ్చారు. మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నానని అన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభ మవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.



### కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్

జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్‌లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు

సిఎం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. కోస్గి వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్లు మంజూరు చేయడం రైతులకు ఉపయోగకరంగా ఉండనుంది. ఈ మొత్తం ప్రాజెక్టులు కొడంగల్ నియోజకవర్గపు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తాయని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడంలో పెద్ద అడుగుగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మృగ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఈ అవకాశాలను సక్రమంగా వినియోగించుకోలేక పోతుందని ఆయన విమర్శించారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కోటి యాభై లక్షల రూపాయల సిఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల బలోపేతంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేక పేదలకు నమ్మకం తగ్గిపోతున్నదని, ఈ పరిస్థితిని మార్చడానికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటివరకు సిఎస్సార్ నిధుల ద్వారా ఐదు కోట్ల రూపాయలు అందజేసి ఆధునిక పరికరాలను తీసుకురావడంలో విజయవంతమయ్యామని చెప్పారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం రూమ్, ఎక్స్?రే మిషన్‌తో పాటు అవసరమైన ఇతర పరికరాలను ఎంపీ నిధుల ద్వారా త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. పరికరాల లేమి పేరుతో పేద రోగులను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయొద్దని వైద్యులకు సూచించారు. సేవా దృక్పథంతో పనిచేస్తే ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై మంచి విశ్వాసం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్రంలోని చెక్‌డ్యాంల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని బండి సంజయ్ ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల వద్ద నుంచి కమిషన్లు తీసుకుందని, ప్రణాళిక



లేకుండా చెక్‌డ్యాంలను నిర్మించారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న కాంట్రాక్టర్లు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగుతున్నారని అన్నారు. చెక్‌డ్యాంలపై విచారణ జరిపించి అవినీతి నిర్ధారణ అయితే కాంట్రాక్టర్ల నుంచి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను పూర్తిగా ఆధునీకరించేందుకు త్వరలో ప్రపోజల్స్ పంపుతామని, జమ్మికుంటలో స్టేడియం నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తామని బండి సంజయ్ ప్రకటించారు.



# ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్, కేంద్రమంత్రులు, ఇతరులు పాల్గొన్నారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ఈ మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారుల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను మహిళలకు అందచేయనున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమం జరుగుతుందని డిప్యూటి సిఎం భట్టి వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు. ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చెలెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.



# మృత్యుశకటం

- సిద్దిపేటలో రోడ్డు ప్రమాదం..
- నవ వధువు మృతి.. భర్తకు తీవ్ర గాయాలు

**సిద్దిపేట, నవంబర్ 24 :** వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టామన్న ఆనందం ఆ నూతన దంపతులకు ఎంతో కాలం నిలవలేదు. కోటి ఆశలతో నూతన బంధంలోకి అడుగుపెట్టిన కొన్నాళ్లకే రోడ్డు ప్రమాదం వారిద్దరినీ వేరు చేసింది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వధువు ప్రాణాలు కోల్పోగా.. భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై సమత వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రణతి (24), సాయికుమార్‌లకు ఇటీవల వివాహమైంది. ఉద్యోగ నిమిత్తం వారిద్దరూ సిద్దిపేట నుంచి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా.. పెద్ద చెప్యాల శివారులో అదుపు తప్పిన ట్రాక్టర్ వేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. 108 వాహనంలో వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో ప్రణతి మృతి చెందింది. సాయికుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కొత్త జీవితంవైపు అడుగులు వేస్తున్న నూతన దంపతుల ప్రయాణం కన్నీటి కథగా మారిపోవడంతో పెద్ద చెప్యాల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# 15 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

బెటాలియన్‌లో చురుగ్గా పని చేస్తున్న నలుగురు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

# ముగిసిన ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ..

(మొదటిపేజీ తరువాయి)

స్నేహితులు, చెలెలు చంద్రిక వ్యవహారంపై వివరాలు సేకరించారు. రవి, అతడి స్నేహితుడు కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్, వీపీఎన్, ఐపీ మాస్కింగ్ వంటి అంశాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీలు జరిగినట్లు తేలింది. క్రిటో ద్వారా అమౌంట్ బదిలీ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఇతర యాప్‌ల ద్వారా కూడా డబ్బులు సంపాదించినట్లు తేలింది. పోలీసుల ప్రశ్నలకు 'నేను ఒక్కడినే అన్ని చేశాను. నా వెనుక ఎవరూ లేరు'అని రవి చెప్పినట్లు సమాచారం. రవి కస్టడీకి సంబంధించి మంగళవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ సమావేశం నిర్వహించనున్నారు. ఐబొమ్మ రవిపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు నమోదు అయ్యాయి. మిగతా కేసుల్లో సైబర్ క్రైమ్ పోలీసులు పిట్ వారెంట్ దాఖలు చేశారు. పలువురు నిర్మాతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపనున్నారు. పిట్ వారెంట్ ద్వారా మరోసారి విచారణకు సిద్ధమవుతున్నారు.

# త్వరలోనే పంచాయతీ ఎన్నికలు

## రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్

## కొడంగల్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి



కొడంగల్,నవంబర్24:రాష్ట్రంలో త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునేవాళ్లను ఈ ఎన్నికల్లో ఎన్నుకోవద్దని సూచించారు. అభివృద్ధి చేసే వారికే అండగా నిలవండి అని కోరారు.సర్పంచ్ ఎన్నికలు అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని మహిళలు ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల కోసం రాజకీయాలను పక్కనబెట్టాలని సూచించారు. అభివృద్ధి విషయంలో అంతా ఒక్కటే అని సంకేతమివ్వాలని సూచించారు. కొడంగల్‌లో పర్యటన సందర్భంగా అక్షయ పాత్ర కిచెన్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే రూ.103కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ప్లలె వెలుగు బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రూ.5వేల కోట్లతో కొడంగల్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తామని.. రాష్ట్రం నలుమూలల నుంచి చదువు కోసం కొడంగల్‌కు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఢిల్లీకి నోయిడా తరహాలో కొడంగల్ మారబోతోందని పేర్కొన్నారు.

# నేడు రూ. 304 కోట్ల వడ్డీలేని రుణాల పంపిణీ

## 3 లక్షల 50 మహిళా స్వయం సహాయక సంఘాలకు లబ్ది

## అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నేరుగా పంపిణీ

## ఇందిరమ్మ చీరల నాణ్యతపై సర్వత్రా హర్షం

## జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి

## జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి




హైదరాబాద్,నవంబర్24 : రాష్ట్రంలోని 3 లక్షల 50 మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 300.40 కోట్ల వడ్డీలేని రుణాలను రేపు పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలియచేసారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ చీరెల పంపిణీ పురోగతి, రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో వడ్డీలేని రుణాల పంపిణీ అంశంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సి.ఎస్ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడవ విడత వడ్డీ లేని రుణాలను 25 వ తేదీ మంగళవారం నాడు ఉదయం 11 గంటలకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న ఈ వడ్డీ లేని రుణాలతో మహిళల్లో ఒక ధైర్యం, నమ్మకం, ఆత్మ విశ్వాసం ఏర్పడిందని అన్నారు. ఈ వడ్డీ లేని రుణాల మొత్తం నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నందున ఎవరెవరికి ఎంత మొత్తం అందిందో సభ్యులకు స్పష్టంగా తెలియ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమ అద్భుతంగా సాగుతోందని, ఈ చీరాల నాణ్యత, డిజైన్ల పట్ల మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, తమకి నాణ్యమైన ఇందిరమ్మ చీరలను అందించడం పట్ల రాష్ట్రం లోని మహిళలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నాణ్యమైన చీరాలను అందచేయడంతో పాటు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను కూడా అందించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, జిల్లాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీని వేగవంతంగా పంపిణీ చేయడంపట్ల జిల్లా కలెక్టర్లను అభినందించారు. త్వరితగతిన ఈ చీరలను పూర్తిగా పంపిణీ చేయాలనీ ఆదేశించారు. రేపు, మంగళవారం అన్ని నియోజక వర్గాల్లో నిర్వహించే వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి సంబంధిత జిల్లాల ఇంచార్జి మంత్రులు, జిల్లా నుండి ప్రాతినిధ్య వహించే మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్షిప్స్ నిధులు విడుదల చేయడం జరిగిందని, ఈ స్కాలర్షిప్స్ లను సమర్ధవంతంగా పంపిణీ చేయడాని మీ జిల్లాల్లో వెల్ఫేర్ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జ్యోతి బుద్దా ప్రకాష్, హౌసింగ్ ఎం.డి గౌతమ్, సెర్ప్ సి.ఈ.ఓ దివ్య, పంచాయితీ రాజ్ కమిషనర్ సృజన లు పాల్గొన్నారు.



# సర్పంచ్ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇందిరమ్మ చీరలు

- ఇందిరమ్మ ఇళ్లు కేవలం తాయిలాల కోసమే
- బిజెపి ఎంపి డికె అరుణ విమర్శలు

**నారాయణపేట, నవంబర్ 24 :** పార్టీ గుర్తులపై సర్పంచులు గెలవరు. అలాంటప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్స్ ఎలా ఇస్తారని ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. ఏ రకంగానైనా సర్పంచ్ ఎన్నికల్లో లబ్ది పొందాలని ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలంటూ తాయిలాలు ప్రకటిస్తుందని విరుచుకు పడ్డారు. దసరాకు ఇవ్వాల్సిన చీరలు ఇప్పుడెందుకు ఇస్తున్నన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. దమ్ముంటే పాలమూరు జిల్లాలో రోడ్లు బాగు చేయాలని సవాల్ విసిరారు. నారాయణపేటలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలకు దిక్కులేక కేంద్రం నిధుల కోసం కక్కుర్తి పడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే సర్పంచుల పదవీకాలం పూర్తికాగానే ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేతకానితనం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన రూ. 3 వేల కోట్లు పంచాయతీల నిధులు ఆగిపోయాయని వెల్లడించారు. ఆ నిధుల కోసమే కాంగ్రెస్ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే ఆలోచన చేస్తోందిని అన్నారు. ఎన్నికల కోసం కాంగ్రెస్ తీరు చూస్తే నవ్వొస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లు, 2024 సర్వే ప్రకారం వార్డ్ మెంబెర్స్ రిజర్వేషన్లు నిర్వహించడం విచారకరమని పేర్కొన్నారు. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని అన్నారు . పిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ కావాలా..? కాంగ్రెసోళ్ళు ఇచ్చే ముతక చీరలు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కొడంగల్‌కు రోడ్లు వేసుకుంటే హైదరాబాద్ , సికింద్రాబాద్‌లా మారిపోయినట్లేనా ? నని నిలదీశారు. జిల్లా వాసికి ముఖ్యమంత్రి అవకాశం వచ్చినా ఇక్కడి ప్రజలకు ఒరిగింది ఏమిలేదని ఆరోపించారు. కేంద్రం ఇచ్చే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

# వివాహేతర సంబంధంలో చిన్నారి హత్య

- తల్లికి, సహకరించిన వ్యక్తికి యావజ్జీవ కారాగారం
- వరంగల్ కోర్టు సంచలన తీర్పు

**వరంగల్, నవంబర్ 24 :** వివాహేతర సంబంధించన కేసులో వరంగల్ కోర్టు సంచలన శిక్ష విధించింది. ఈ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధించారు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని మూడేళ్ల కూతురిని అతి కర్కశంగా హతమార్చిన తల్లికి, ఆమెకు సహకరించిన మరో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయస్థాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. హైదరాబాద్ చార్మినార్ ప్రాంతంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్న సయ్యద్ యూసఫ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు. వారిని పట్టించుకోకపోవడంతో పిల్లలను తీసుకొని భార్య యూసఫ్‌ను వదిలి పెట్టి వెళ్లింది. అదే ప్రాంతంలో సయ్యద్ హాజీరా బేగం తన భర్త ఇంతియాజ్ అలీ, మూడేళ్ల కూతురు ఫాతిమా సబాతో నివసిస్తున్నారు. యూసఫ్‌కు, హాజీరా బేగం మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధం ఏర్పడింది. హైదరాబాద్‌లో ఉండటం క్షేమం కాదని భావించి వీరిద్దరూ చిన్నారి ఫాతిమా సబాతో కలిసి వరంగల్‌లోని రంగశాయిపేటకు వచ్చారు. పాతసామాను వ్యాపారి మహ్మద్ ఖాసిం వద్ద పనికి కుదిరారు. అదే వ్యాపార ప్రాంగణంలో ఒక గదిలో జీవిస్తున్నారు. కొన్నాళ్ల తరువాత వివాహం చేసుకోవాలని హాజీరా బేగం యూసుఫ్‌ను కోరింది. చిన్నారిని అడ్డు తొలగిస్తేనే వివాహం చేసుకుంటా ననడంతో ఆమె అంగీకరించింది. దీంతో యూసఫ్ 2022 ఏప్రిల్ 23న నిద్రిస్తున్న చిన్నారి రెండు చేతులను గట్టిగా పట్టుకొని గిరాగిరా తిప్పి నేలకు కొట్టాడు. ఆ వెంటనే కన్నతల్లి ఆ చిన్నారి నోరుమూసి గొంతు నులిమేసి హత్య చేసింది. ఈ విషయంపై పాత సామాన్ల వ్యాపారి ఖాసిం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావటంతో న్యాయస్థానం నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

# బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్రోహం

- కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తాం
- 42శాతం ఇవ్వకుండా దేశమంతా రాహుల్ ప్రయారం
- రాహుల్ బిసి వ్యతిరేకతను ఢిల్లీలోనే ఎండగడతాం
- వచ్చే పార్లమెంటులో దీనిపై రాహుల్ చర్చించాలి
- బిఆర్ఎస్ నేతల సమావేశంలో కెటిఆర్ వెల్లడి



హైదరాబాద్,నవంబర్24: బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహంపై ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామని అన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బీసీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎలాంటి రిజర్వేషన్ల పెంపు జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీలపై, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బీజేపీ పదేపదే బీసీల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకొని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని, బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కన పెట్టిందని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు బీసీలకు బ్జడెట్‌లో సంవత్సరానికి ?20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. వచ్చే బ్జడెట్‌లో 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకువెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పైన కేటీఆర్ పలు సూచనలు చేశారు. సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దర్శకుడు ప్రమోద్ కుమార్ హఠాన్మరణం

హైదరాబాద్,నవంబర్24: తెలుగు సినిమా రంగంలో మరో విషాద సంఘటన చోటు చేసుకుంది. సీనియర్ దర్శకుడు ప్రమోద్ కుమార్ హఠాన్మరణం చెందారు. మాస్ మహరాజా రవితేజ కెరీర్ ప్రారంభ దినాల్లో ఆయన హీరోగా తెరకెక్కిన సినిమా 'మనసిచ్చాను'. సిహెచ్ సుధాకర్ నిర్మించిన ఈ సినిమాతో ప్రమోద్ కుమార్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. తొలుత దర్శకత్వ శాఖలో పనిచేసిన రవితేజ ఆ తర్వాత పలు చిత్రాలలో చిన్న చిన్న పాత్రలు చేశారు. 1999లో ఆయన సోలో హీరోగా 'నీ కోసం' మూవీ వచ్చింది. ఆ తర్వాత కూడా కొన్ని సినిమాల్లో కీలక పాత్రలు పోషించిన రవితేజ... సోలో హీరోగా వచ్చిన రెండో సినిమా 'మనసిచ్చాను'. ఇందులో మణిచందన (ఓజీనితిఇరజీనిటజీనిజీ) హీరోయిన్ గా నటించింది. ఈ సినిమాకు ముందు ప్రమోద్ కుమార్... 'చిటికెల పందిరి'లో ఆ చిత్ర కథానాయకుల్లో ఒకరైన ఆనంద చక్రపాణి పరిచయం తో నటించారు. ఆపైన దర్శకత్వం వైపే మొగ్గు చూపారు. రవితేజ హీరోగా 'మనసిచ్చాను' చిత్రాన్ని రూపొందించిన తర్వాత ఆయనకు మరే అవకాశం రాలేదు. అయినా సినిమా రంగంలోనే కొనసాగుతూ ఉన్నారు.



# సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దా

## ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్,నవంబర్24: అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్‌నగర్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. సోమవారం సనత్‌నగర్‌లోని బీకే గూడలో గల సీనియర్ సిటీజన్స్ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు పైబడిన 34 మంది, 70 సంవత్సరాలు పైబడిన 32 మంది సీనియర్ సిటీజన్స్‌ను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తమ వయసు సైతం లెక్క పెట్టకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా సీనియర్ సిటీజన్స్ నిలుస్తున్నారని ప్రశంసించారు. 2014లో తాను సనత్‌నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సీనియర్ సిటిజన్ కౌన్సిల్ సౌకర్యార్థం ఓ కార్యాలయం నిర్మించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఉండాల్సిన సమయంలో సమాజానికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ఒక కమిటీగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ చేపట్టే కార్యక్రమాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నానని, ఇక ముందు కూడా కొనసాగిస్తానని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు . నత్‌నగర్ నియోజకవర్గంలో 2014 తర్వాతనే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపెట్టామని చెప్పుకొచ్చారు.



# 29న దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం
- బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పిలుపు

**సూర్యాపేట, నవంబర్ 24 :** ఈనెల 29న నిర్వహించనున్న దీక్ష దివాస్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్యనేతలతో సన్నాహక సమావేశ నిర్వహించిన అనంతరం జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు నవంబర్ 29 అని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో.. అన్న నినాదమే ఉద్యమానికి ఊపిరి పోసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ఏర్పాటు సాధనలో ఆరోజే కీలకమని పేర్కొన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్ర మెడలు వంచిందని జగదీశ్ రెడ్డి అన్నారు. ఆ దీక్షతోటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ఉద్యమం ఉవ్వెత్తున లేచి.. అన్ని రంగాలు ఐక్యతతో కలిసి వచ్చినాయన్నారు. అందుకే ఆరోజు ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి దీక్షదివాస్‌కు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. రాష్టానికే ఆదర్శంగా సూర్యాపేటలో దీక్షదివాస్‌ను నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు..కేవలం డబ్బు సంపాదనే రేవంత్ లక్ష్యమని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. అందుకే పెద్ద ఎత్తున భూ కుంభకోణాలకు పాల్పడుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని తెలిపారు. ఇండస్ట్రియల్ కార్పొరేషన్ కు కేటాయించిన భూముల్లో ప్రభుత్వ మోసం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కోకాపేటలో ఎకరం 100 నుంచి 170 కోట్లు వేలంలో విక్రయించినట్లు చెబుతున్న ప్రభుత్వం.. ఇప్పుడు అదే ప్రాంతంలో అతి తక్కువ ధరకు విక్రయించడంలో అర్థమేంటి అని ప్రశ్నించారు. ప్రజాధనం దోచుకోవడం పైనే రేవంత్ సర్కార్ దృష్టి పెట్టిందని జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూముల కుంభకోణంపై వచ్చే ప్రభుత్వంలో విచారణ తప్పదని హెచ్చరించారు. ప్రజల ప్రభుత్వ ఆస్తులను దోచుకున్న వారు ఎవరైనా వదిలిపెట్టమని స్పష్టం చేశారు.



# బిసిలకు హామీతోనే కాంగ్రెస్ అధికారం

- బీహార్‌లోనూ 42శాతంపై రాహుల్ ప్రచారం
- మాట తప్పడం..మడమ తిప్పడం రేవంత్ నైజం
- మాజీ స్పీకర్ మధుసూధనాచారి విమర్శలు

**హైదరాబాద్, నవంబర్ 24 :** మడమ తిప్పడం.. మాట తప్పడం సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర అని మాజీ స్పీకర్ మధుసూదనచారి విమర్శించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని .. బిహార్‌లో రాహుల్ గాంధీ ప్రచారం చేసుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బండ ప్రకాశ్, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి మధుసూదనచారి మీడియాతో మాట్లాడారు. బీసీలకు హామీలు ఇవ్వడంతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మధుసూదనచారి తెలిపారు. హామీలు అమలు చేయనందుకు రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా బీసీల కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు పెడతామని అన్నారని గుర్తుచేశారు. కానీ హామీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డి రాజకీయ జీవితానికి బీసీలు చరమగీతం పాడతారని హెచ్చరించారు.జీవో నంబర్ 46తో బీసీల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని బండ ప్రకాశ్ విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ చర్యలు ప్రహసనంగా మారిందని అన్నారు. ఆర్టికల్ 340 కింద డెడికేటెడ్ కమిషన్ వేయాలని కోరామని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన కమిషన్‌కు రాష్ట్రపతి ఆమోదం కూడా ఉంటుందని చెప్పామని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సూచన పట్టించుకోలేదని మండిపడ్డారు. రెండు ప్రధాన పార్టీలు సంపూర్ణంగా సహకరిస్తే తప్ప ఇది సాధ్యం కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. బీసీలకు అన్ని రాజకీయ అవకాశాలు ఇచ్చింది బీఆర్ఎస్ మాత్రమేనని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ఎస్సీల ఎదుగుదలకు అడ్డంకిగా క్రిమిలేయర్!



**ఎస్సీలలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని ఇటీవల పదవీ విరమణ పొందేముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేసిన సూచన సమాజానికి ఓ హెచ్చరిక లాంటిది. రాజకీయ పార్టీలు దీనిపై చర్చించాలి. పార్లమెంట్ దీనిపై చర్చించాలి. ఎందుకంటే సామాజికంగా ఎస్సీలు అంతా అభ్యున్నతి చెందాలంటే ఇది అత్యావశ్యకం. అప్పడే ఎస్సీలంతా ఉన్నతంగా ఎదుగుతారు. లేకుంటే రిజర్వేషన్లు ఎన్నేళ్లు పెట్టినా కొందరే తన్నుకుపోతారు. ఇది అమలు కాకపోవడం వల్ల కేవలం కొందరే రిజర్వేషన్ల లబ్దిని పొందుతున్నారు. దీంతో గత 75 ఏళ్లుగా కొందరే ఉద్యోగ, రాజకీయ లబ్ది పొందుతూ వస్తున్నారు. వారి కుటుంబాలే సమాజాంలో వెలుగొందుతున్నాయి. పదవీ విరమణ పొందిన జస్టిస్ గవాయ్ దీనిని గట్టిగా సూచించి ఉంటే బాగుండేది. కేంద్రం కూడా ఎందుకో ఈ విషయంలో పట్టించుకోవడం లేదు.**

నిజానికి రిజర్వేషన్లను కొంతకాలం వరకే అమలు చేయాలి. ఒక కుటుంబం రిజర్వేషన్ల పొందిన తరవాత వారు ఉన్నతస్థానం చేరుకున్నాక వారిని క్రిమిలేయర్‌గా గుర్తించి, వారిని దూరం పెట్టాలి. ఉద్యోగాల్లో అయినా రాజకీయాల్లో అయినా ఇది చేసితీరాలి. ఇది లేకపోవడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన వారు వారసత్వం గా రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, తెగల వారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమానత్వం, ఏకరూప అభివృద్ధి సాధించ వలసి వుంది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధానాల ప్రభావాలను సమిక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ ఆంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి. హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశిరచిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాలను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతుబద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపోయారు.

ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరినవారు ప్రగతిశీల దృక్పథంతో క్రీమీలేయర్ అమలును స్వాగతించాలి. అగ్రకులాల వారిని విమర్శిస్తున్న వారు ఈ క్రిమీలేయర్ గురించి మాట్లాడడం లేదు. ముఖ్యంగా దళితుల్లో చైతన్యం రావాలి. వారే రిజర్వేషన్ను క్రమబద్ధీకరించే విషయంలో పోరాడాలి. అప్పడే అస్సు రిజర్వేషన్లు పొందని వారికి న్యాయం జరగగలదు. ఉదాహరణకు ఓకుటుంబం తరాలుగా రిజర్వేషన్లను అనుభవిస్తోంది. వారు ఉన్నత స్థానానికి ఎదిగారు. పారిశ్రామిక వేత్తులుగా రాణిస్తున్నారు. ఇలా అనేకులు ముందు ఉన్నారు. కేవలం వీరిని ఉదాహరణగా చూపడం తప్ప వీరిగురించి వేరే ఉద్దేశ్యంతో కాదు. పన్న శ్రేణి అంటే క్రీమీలేయర్ విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టడం అత్యంతావశ్యకం. జస్టిస్ గవాయ్ చేసిన సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ కావాలి. ఎస్సీల్లో ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఉద్యమించినట్లుగానే క్రిమీలేయర్ కోసం కూడా దళితులే ఉద్యమించాలి. ఈ డిమాండ్ చాలాకాలంగా ఉంది. అయితే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్దిపొందిన ఎస్సీలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇది సరికాదు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు దీనిపై చర్చించాలి. ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరిం చడం సరికాదు. ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచించడం అన్యాయం అని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలది సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాల్సిన తరుణంలో కొందరే అనుభవించడం సరికాదు. ఎస్సీల్లో కొందరు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు పొంది ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా మిగతా వారు వేదనకు గురవుతున్నారు.

ఇదో రకంగా ఎస్సీల్లో దొరతనానికి పరాకష్టగా చూడాలి. ఎస్సీలో కొందరు పెద్ద దొరలు తయారవుతున్నారు. రిజర్వేషన్ల ఫలాలతో ఎదిగిన ఈ వర్గాల్లో చాలామంది అభివృద్ధి చెందిన ఇతర కులాలతో అంటకాగుతూ, తమ వర్గాలను విస్మరిస్తున్నారు. ఈ కారణంగా 90శాతం మిగతా ఎస్సీల్లో ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేకపోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొందిన వారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ తమ వారికి అడ్డుగా మారుతున్నారు. డబ్బు సంపాదనలో ముందున్న కొందరు తమ వర్గంలోని మిగతావారిని పైకి తీసుకుని రాలేకపోతున్నారు. సంపన్నశ్రేణిని గుర్తించి సరిచేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం చూపగలం. అలాగే రిజర్వేషన్లు ఎల్లకాలం అనుభవించే హక్కునుంచి వీరిని దూరం చేయాల్సిందు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుస్తూ రిజర్వేషన్ల దగ్గరికి వచ్చినపుడు ఒక ఐఏఎస్ అధికారి సంతతిని, ఒక పేద వ్యవసాయ కూలీ సంతతిని సమానంగా చూడరాదని అన్నారు. ఇది వాస్తవం. నిజానికి రిజర్వేషన్ల నిచ్చెనలు ఎక్కిన ఎందరో మిగతా ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతున్న దాఖలాలు లేవు. అందువల్ల క్రీమిలేయర్ విధానం అమలు జరగాలి. ఒక కుటుంబానికి ఒకటి రెండుసార్లే రిజర్వేషన్లు అమలు కావాలి. అప్పడే ఎస్సీలు సామాజికంగా ఎదుగగలరు.

## డబుల్ ఇళ్ల పేరుతో వసూళ్లు

### మధ్యవర్తిపై ప్రజల ఆరోపణలు

**సంగారెడ్డి, నవంబరు 24 :** సంగారెడ్డి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని పేదలను నమ్మించి ఓ వ్యక్తి మోసం చేశాడు. అమీన్ పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన బీహెచ్ఈఎల్ ఉద్యోగి ప్రసన్న కుమార్ పై బాధితులు ఆరోపణలు చేస్తున్నారు. జోష్ బ్రదర్ అనే మధ్యవర్తి ద్వారా పరిచయమైన ప్రసన్న కుమార్.. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ. 3 లక్షల నుంచి నాలుగైదు లక్షలు వసూలు చేశాడని పేర్కొంటున్నారు. మొత్తం 69 మంది దగ్గర నుంచి రూ. రెండు కోట్ల 50 లక్షల రూపాయల వరకు మోసం చేశాడని ఆరోపణలు చేస్తున్నారు. అయితే, జోష్ అనే వ్యక్తి ద్వారా డబ్బులను ప్రసన్న కుమార్ దండుకున్నాడు.. 2021 నుంచి నేడు, రేపు ఇప్పిస్తామంటూ ప్రసన్న కుమార్ మాయమాటలు చెప్తున్నాడని బాధితులు పేర్కొంటున్నారు. అయితే, కిష్టారెడ్డిపేటలోని ప్రసన్న కుమార్ ఇంటికి వెళ్తే వాచ్ మెన్, కుక్కలతో దాడి చేయించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ లో బీహెచ్ఈఎల్ ఉద్యోగి ప్రసన్నకుమార్ పై ఫిర్యాదు చేశారు. జోష్ ను నిలదీయగా ప్రసన్న కుమార్ కే మొత్తం డబ్బులు ఇచ్చానని చెప్తున్నాడు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. మాకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకపోయినా సరే, మా డబ్బులు మాకు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

## రైతును విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

- రెండేళ్లలో 720 మంది రైతుల ఆత్మహత్య
- కవిత తనపై ఎందుకు విమర్శలు చేస్తోందో
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆగ్రహం

**వనపర్తి, నవంబరు 24 :** రైతుల విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. మరికొద్ది రోజుల్లో ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటై రెండు ఏళ్లు పూర్తి చేసుకోబోతోందని.. ఈ కాలంలో 720 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సోమవారం వనపర్తిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 10 శాతం పనులు పూర్తి చేస్తే అయిపోతుందని.. కానీ పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని వ్యంగ్యంగా పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపకుండా తనపై దుర్భాషలాడడం ఎంత వరకు సమంజసమన్నారు. తాను ఒక్కసారి కూడా కవితపై పల్లెత్తు మాట అనలేదని తెలిపారు. డూప్లికేట్ కాంగ్రెస్ వాళ్లు తనపై సోషల్ మీడియాలో కావాలనే బ్లేమ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత ఎవరిని సంతోషపెట్టాలని తనపై ఎందుకు దూర్భాషాలాడుతుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కక్ష పూరితంగా ఎవరి మీద కేసులు పెట్టించ లేదన్నారు. ఒక వేళ అలా ఏమైనా ఉంటే నిరూపించాలని అంతేకాని అసత్య ఆరోపణలు చేయవద్దని కవితకు సూచించారు. తాను ఎంతో మంది విద్యార్థులను స్వంత ఖర్చులతో చదివించానని గుర్తు చేశారు. కానీ వాటిని తాను ప్రచారం చేసుకోలేదన్నారు. తాను గతంలో న్యాయవాదిగా ఉన్నప్పుడు పెబ్బేరు సంత భూమి విషయంలో 2003, 2007లో



పూజారులకే చెందుతుందని తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. కానీ తాను కబ్జా చేశాననడం అసత్య ప్రచారమన్నారు. పూర్తి విషయ పరిజ్ఞానం లేకుండా తాను దేవుడి మాన్యాన్ని కబ్జా చేశానంటూ కవిత ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు. తమ పార్టీ ఇప్పుడు అధికారంలో లేదని.. తనపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయాలంటూ ప్రత్యర్థులకు ఆయన సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు సైతం కేసీఆర్‌ను కానీ.. ఆయన పార్టీ జెండాను కానీ వదల లేదన్నారు. తండ్రి వయస్సు ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంటికి పిలిపించుకుని మాట్లాడుతున్నావంటూ కవితపై నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. తమలాంటి నలుగురు, ఐదుగురిపై విషం చీమ్ముతున్నావని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## 10 వేల ఏళ్లలో తొలిసారి పేలిన అగ్నిపర్వతం

### విమానయాన సంస్థలు అలర్ట్

**ఇథియోపియా :** ఆఫ్రికా దేశమైన ఇథియోపియాలో ఓ అగ్నిపర్వతం 10 వేల సంవత్సరాల్లో తొలిసారిగా పేలింది. భారీ విస్ఫోటం కారణంగా పెద్దఎత్తున బూడిదతోపాటు పొగలు వెలువడుతున్నాయి. ఇవి నింగిలో వేల మీటర్ల ఎత్తుకు చేరుకోవడంతో.. విమాన రాకపోకలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం కేరళలోని కన్నూర్ నుంచి అబుధాబీకి బయల్దేరిన విమానాన్ని మార్గంమధ్యలో అహ్మదాబాద్‌కు దారిమళ్లించారు. హేలీ గుబ్బి అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, పొగ ఉత్తర భారతానికీ విస్తరించే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం మీదుగా వెళ్లాల్సిన విమాన సర్వీసులపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పౌర విమానయానశాఖ అధికారులు, విమానయాన సంస్థలు ఇప్పటికే ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం. పేలుడు కారణంగా విమాన కార్యకలాపాలపై ప్రభావాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని, ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని 'ఆకాశ ఎయిర్' ఓ ప్రకటనలో తెలిపింది. హేలీ గుబ్బి అగ్నిపర్వతం



ఇథియోపియాలోని అఫర్ రీజియన్‌లో ఉంది. గత 10 వేల సంవత్సరాల్లో ఇది పేలినట్లు రికార్డులు లేవు. తాజా విస్ఫోటాన్ని స్థానిక చరిత్రలో అత్యంత అసాధారణమైన ఘటనల్లో ఒకటిగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మారుమూల ప్రాంతం కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియరాలేదు. దీన్నుంచి పెద్దఎత్తున వెలువడిన బూడిద, పొగ ఇప్పటికే ఎర్ర సముద్రం మీదుగా ఒమన్, యెమెన్ దేశాలకు విస్తరించాయి. దీంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు.

## మాదాపూర్‌లో గంజాయి, మాదకద్రవ్యాల పట్టివేత

### దాడులు చేసి స్వాధీనం చేసుకున్న ఎస్‌వోటి పోలీసులు

**హైదరాబాద్, నవంబరు 24 :** మాదాపూర్ జోన్ పరిధిలో ఎస్ఓటీ పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్‌ను పట్టివేశారు. సోమవారం మొదట మాదాపూర్ లో 41కిలోల గంజాయి, 15గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, 1.170గ్రాముల అల్ప్రజోలంనుమాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. మూడు చోట్ల డ్రగ్స్ రాకెట్ ను బస్ట్ చేశారు పోలీసులు. ఈ సందర్భంగా మొదటి కేసుకు సంబంధించి డ్రగ్స్ పట్టివేతకు సంబంధించిన వివరాలను వెల్లడించిన మాదాపూర్ జోన్ డీసీపీ రీతిరాజ్.. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పది లక్షల రూపాయల విలువ చేసే 1.170 గ్రాముల అల్ప్రజోలం పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో గౌండ్ల బాల మురళి కృష్ణ(38) అనే వ్యక్తి చుట్టు పక్కల దుకాణాల్లో సప్లై చేస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ పట్టుకున్నట్లు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల కోసం బెంగుళూరు నుండి తెచ్చినట్లు గుర్తించారు. హరీష్, సాయి కృష్ణ, సాయి మణికంత అనే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి ఒక లక్ష 50 వేల విలువ చేసే 15 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. మూడో కేసులో కొల్లూరు పోలీస్ స్టేషన్



పరిధిలో 41కిలోల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు డీసీపీ రీతిరాజ్. వెస్ట్ బెంగాల్ నుంచి తెచ్చిన గంజాయిని.. హైదరాబాద్ లో బీహార్ కూలీలకు అమ్ముతున్నారని తెలిపారు. వెస్ట్ బెంగాల్ నుండి సికింద్రాబాద్ వరకు ట్రైన్ లో తెచ్చి అమ్ముతున్నారని చెప్పారు. ఈ కేసులో మిథున్ బర్మాన్, సడెన్ రాయ్, రీజుల్ ÷క్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారినుంచి 21లక్షల రూపాయల విలువ చేసే 41.9కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## బెంగాల్ నుంచి బంగ్లాదేశీయుల ఇంటిబాట

**బెంగాల్ :** 'హకీంపుర్'.. పశ్చిమ బెంగాల్‌లో భారత్- బంగ్లాదేశ్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో చరిత్ర పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది. కానీ, రివర్స్ డైరెక్షన్‌లో. 1947లో దేశ విభజన, 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధం సమయంలో ఆ దేశం నుంచి వేలాది మంది శరణార్థులు సరిహద్దు దాటి ఇక్కడికి చేరుకున్నారు. ప్రస్తుతం అనేక మంది స్వదేశం బాట పడుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 'ఎస్ఐఆర్' ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక ఏళ్ల క్రితం హకీంపుర్‌లో స్థిరపడిన, సరైన పత్రాలు లేని బంగ్లాదేశ్ జాతీయులు నవంబరు ప్రారంభం నుంచి స్వచ్ఛందంగా స్వదేశానికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ ఆధార్, ఓటరు కార్డులు, అసలు పత్రాలే లేకుండా నివసిస్తున్నవారు.. ఇక తప్పించుకోలేమన్న భావనతో ఎన్నికల సిబ్బంది ఇళ్లకు వచ్చేలోపే తిరిగి వెళ్లిపోవాలని చూస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు తమ ఇంటి పెద్దలు వచ్చిన హకీంపుర్ బార్డర్ అవుట్‌పోస్ట్ దారిలోనే తిరుగు ప్రయాణమవుతున్నారు. ఇక్కడి అక్రమ చొరబాటుదారులు చాలావరకు బంగ్లాదేశ్‌లోని ఖుల్నా, సతిరా, జశోర్, బగెర్హట్ తదితర ప్రాంతాలకు చెందిన దినసరి కూలీలే. పనుల కోసం చట్టవిరుద్ధంగా భారత్‌లోకి ప్రవేశించామని, తమవద్ద పత్రాలు లేవని చాలామంది బహిరంగంగా అంగీకరిస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ



పీటీఐ వార్తాసంస్థ పేర్కొంది. 1971 సమయంలో శరణార్థులకు ఆశ్రయం కల్పించిన ఇక్కడి గ్రామస్థులు.. ప్రస్తుత పరిణామాలను అసాధారణమైనవిగా పేర్కొన్నారు. అప్పట్లో మాదిరిగానే.. ఇప్పుడు కూడా వీరికి ఆహారం, చాయ్ వంటివి అందిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు స్వచ్ఛందంగా తిరిగి వెళ్లిపోతున్నవారి సంఖ్య నవంబరు రెండో వారం నుంచి ఒక్కసారిగా పెరిగినట్లు బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితులను వారు 'ఎస్ఐఆర్'తో ముడిపడి పెడుతున్నట్లు తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఎంతమంది తిరిగి వెళ్లారనే వివరాలపై స్పష్టత లేదు. మరోవైపు ఈ పరిణామాల గురించి తెలుసుకున్న బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్.. హకీంపుర్ బీఎస్ఎఫ్ బార్డర్ అవుట్ పోస్ట్ వద్ద పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని తెలిపారు.




## సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్రమాదం

### సెంట్రింగ్ కూలి ముగ్గురు కార్మికుల దుర్మరణం

**హైదరాబాద్, నవంబరు 24 :** సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో సోమవారం ప్రమాదం జరిగింది. భవనం మరమ్మతులు చేస్తుండగా.. సెంట్రింగ్ కుప్పకూలింది. శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో ముగ్గురు కార్మికులు మరణించారు. ఈఎస్ఐలోని అత్యవసర విభాగంలో ఆధునీకరణ పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రిలోని ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో.. వాటిని తొలగించి కార్మికుల మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. వివరాలు సేకరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులు ఈఎస్ఐ ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

## అధికారిక వాహనం వదిలిన మాజీ సిజెఐ గవాయ్

**న్యూఢిల్లీ, నవంబరు 24 :** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేసారు. ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ తాను వచ్చిన అధికారిక కారును కొత్త సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. నిబంధనల ప్రకారం సీజేఐగా పదవీవిరమణ చేసిన అనంతరం మాజీ సీజేఐలు తాము ఉంటున్న అధికారిక నివాసాలను, సీజేఐకి ప్రభుత్వం ఇచ్చే ఇతర సౌకర్యాలను వీడాల్సి ఉంటుంది. అందులోభాగంగానే జస్టిస్ గవాయ్ కారును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. అయితే జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జస్టిస్ గవాయ్ కారును అక్కడే వదిలివేయడం గమనార్హం. ఈ ఏడాది మే 14వ తేదీన 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం ముగియడంతో సోమవారం నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేశారు.

## భర్తను కడతేర్చిన భార్యలు

### పెట్రోల్ పోసి నిప్పంటించిన ఇద్దరు పెళ్లాలు

**నిజామాబాద్, నవంబర్ 24 :** మద్యం సేవించి తరచూ వేధిస్తున్న భర్తను ఇద్దరు భార్యలు కలసి మట్టుబెట్టారు. దారుణంగా హత్య చేశారు. ఆయన ఇద్దరు భార్యలు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం దేవక్కపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవక్కపేటకు చెందిన మలవత్ మోహన్ (42)కు ఇద్దరు భార్యలు కవిత, సంగీత ఉన్నారు. మోహన్ తరచూ మద్యం తాగుతూ.. భార్యలతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం రాత్రి వారిద్దర్నీ గదిలో బంధించాడు. దీంతో విసిగిపోయిన భార్యలిద్దరూ అతడిని వదిలించుకోవాలనుకున్నారు. పథకం ప్రకారం.. సోమవారం ఉదయం పెట్రోల్ కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న మోహన్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో మంటలు అంటుకొని మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈఘటన గ్రామంలో సంచలనం రేపింది. సర్వత్రా ఇదే అంశంపై చర్చించారు. భార్యల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.



## కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాలి

### ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి

**ఇల్లందు రాజముద్ర న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తీవ్రంగా ఖండిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను వెనక్కు తీసుకునే అంతవరకు కార్మిక సంఘాలు సమన్వయం చేసుకొని ఐక్యంగా పోరాడాలని ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షులు డా. జి. సంజీవ రెడ్డి, ఐ ఎన్ టి యు సి జాతీయ సెక్రెటరీ జనక్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని వి.ఎస్. టి యూనియన్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు దేశంలోని కార్మికుల హక్కులను భారీగా హరించేలా రూపొందించబడ్డాయని, కనీస వేతనాలు, సామాజిక భద్రత, యూనియన్ హక్కులు, సురక్షితమైన పని పరిస్థితులుఇవన్నీ తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు. సమావేశంలో ఐ ఎన్ టి యు సి రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆర్.డి. చంద్రశేఖర్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ యాదవ్, రాష్ట్ర సెక్రటరీ ఐ ఎన్ టి యు సి రామకృష్ణ రెడ్డి, ఐ ఎన్ టి యు సి సింగరేణి నాయకులు త్యాగరాజన్, డెక్కన్ క్రానికల్ యూనియన్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, వీఎస్టీ యూనియన్ నాయకులు పాల్ తదితరులు పాల్గొన్నారు.



## లేబర్ కోడ్ల అమలుకు వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనండి

**ఇల్లందు, రాజముద్ర న్యూస్ :** మోడీ ప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దుచేసి తెచ్చిన కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్ ల అమలు చేయటానికి పూనుకోవటం 90 కోట్ల శ్రామికులకు ద్రోహం చేయడమేనని కార్పొరేట్ల జపం చేస్తున్న సంగ్ పరివార శక్తులు,మోడిషా చర్యలో భాగమని లేబర్ కోడ్ ల అమలుకు వ్యతిరేకంగా 25 బొగ్గుగనులపై కాంట్రాక్టు,పర్మినెంటుకార్మికులునల్లబ్యాడ్జిలతో నిరసన తెలపాలని 26న జిఎం ఆఫీసు వద్ద ధర్నా చేయాలని జి ఎల్ బి కే ఎస్, గౌరవాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇల్లందులో జరిగిన జి ఎల్ బి కే ఎస్, ఎస్ సి సి డబ్ల్యూ యు ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మిక సంఘాలు జివిల్ బికేఎస్,తెలంగాణ ఉద్యోగుల సంఘం, ఎస్జీకేఎస్,టిఎన్టియుసి ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఆందోళన కార్యక్రమాలకు పూనుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాయని ఆయన తెలిపారు. సమావేశంలో జీఎల్బికే ఎస్ జనరల్ సెక్రెటరీ జె.సీతా రామయ్య,కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎండి.రాసుద్దీన్,ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కే.సారంగ పాణి,కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ అధ్యక్షులు కొండపల్లి శ్రీనివాస్,కొప్పుల శ్రీనివాస్,బయ్యా వరప్రసాద్,కాపుకృష్ణ,పోషం బాబు,ఇఫ్టుఏరియా కమిటీఅధ్యక్ష, కార్యదర్శులు రావూరి ఉపేందర్ రావు తదితరులుపాల్గొన్నారు.



## కార్మికులకు వెన్నుపోటు పొడిచిన బీజేపీ

### ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్

**ఇల్లందు రాజముద్ర న్యూస్ :** 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వెన్నుపోటు పొడిచిన బిజెపి పాలకుల కుట్రలను కార్మిక సంఘాలు ఖండించాలని ఇల్లందు ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇల్లందు గనులపై ఎఐటియుసి నిరసనలు తెలుపుతూ సోమవారం సింగరేణి సోమవారంఅధికారులకు వినతిపత్రం అందజేశారు. నజీర్ అహ్మద్ మాట్లాడుతూ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 29 కార్మిక చట్టాలను సాధించుకుంటే నేటి నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమ చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నూతన నాలుగు లేబర్ కోడ్ లు తేవటం దురదృష్టకరమని ఆగ్రహఏఐటియుసి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ కొంగర వేంకటేశ్వర్లు,ఎఐటియుసి జిల్లా సమితి సభ్యులు గుగులోత్ కృష్ణ,ఫిట్ కార్యదర్శులు దాట్ల వేంకటేశ్వర్లు, వి జయరాజ్, జక్కుల శ్రీనివాస్,నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, కలవల సిద్దార్థ్, చాంద్ పాష, చిక్కా శ్రీనివాస్, పెరుగు వేంకటేశ్వర్లు, పి యుగేందర్,అజ్మీరా కిషోర్ ,సామల శ్రీనివాస్,బట్టు రవి,గుగ్గిల్ల శ్రీనివాస్, చెరుకు సారయ్య, వెంకటనర్సయ్య, ప్రసాద్ రెడ్డి, రాజు, వేంకట్ రెడ్డి,ఎస్ రవి, కరణా శంకర్, అనిత, రజనీ, చంద్రకళ ,శాంతి, జరినా తదితరులు పాల్గొన్నారు.



## మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను వెనక్కి తీసుకోవాలి

### టియుసిఐ డిమాండ్

**ఇల్లందు రాజ ముద్ర న్యూస్ :** టి యు సి ఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గ హక్కులపై కత్తి కట్టిందన్నారు. కార్మిక వర్గం ఐక్యం చేసి లేబర్ కోడ్స్ ను తిప్పి కొట్టేందుకు ఐక్యం కావాలని కోరుతూ సోమవారం స్థానిక జిసిసిలో హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం బొల్ల సీతారాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టియుసిఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ, ఈనెల 27న కొత్తగూడెం ఉర్దూ గర్ల్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ దేశంలో కార్మిక శ్రమను దోచేందుకు కార్మికులకు రక్షణ కవచంగా ఉన్న చట్టాలను సమూలంగా మార్చివేసి కార్మికులను బలహీనపరిచేందుకు 8 గంటల పనిని రద్దుచేసి 10 నుండి12 గంటలు వారానికి 48 గంటల పేరుతోటి కార్మికులకు హక్కులు లేకుండా నిర్దాక్షణంగా కార్మికులను యాజమాన్యాలు తొలగించే విధంగా లాకౌట్ చేసే విధంగా కదిలితే మెదిలితే అనేక ఆంక్షలతో నేడు యాజమాన్యాలకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చిందని కార్మిక వర్గం ఈ చట్టాలను వెనక్కి కొట్టేందుకు పోరాటాలతొ ముందు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ ఏరియా నాయకులు బొల్లి రవి, హమాలీ యూనియన్ కార్యదర్శి శ్యామ్ బి శీను, మోటం సంపత్, రామచంద్రూ, ఎలేందర్, దుర్గారావు,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### గండూరి ప్రీతమ్ జోన ఫౌండేషన్

# సేవలు అభినందనీయం

### మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** గండూరి ప్రీతమ్ జోన ఫౌండేషన్ ద్వారా సూర్యాపేట పట్టణంలోని జూనియర్ కాలేజ్ నందు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్న వందమంది నిరుపేద విద్యార్థులకు ఏకరూప దుస్తులను, ఎగ్జామ్ ప్యాడ్ లను ఫౌండేషన్ వ్యవస్థాపకులు గండూరి ప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి , సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కాలేజ్ లోని పేద విద్యార్థులకు యూనిఫామ్ లను,ఎగ్జామ్ ప్యాడ్ లను బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్ అందజేయడం పట్ల అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ కాలేజీలో విద్యార్థులే మానసికంగా ధైర్యంగా ఉంటారని ప్రైవేటు కాలేజీలో ర్యాంకులు తప్ప వారికి సామాజిక చైతన్యం ఉండదని ఆయన అన్నారు. ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ యాదయ్య మాట్లాడుతూ తాము కోరిన వెంటనే తమ కాలేజ్ లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు గండూరి ప్రీతమ్ జోన ఫౌండేషన్ ద్వారా గండూరి ప్రకాష్ తన స్వంత ఖర్చుతో యూనిఫామ్ క్లాత్ కొని,కుట్టించి ఇవ్వడం పట్ల ధన్యవాదములు తెలిపారు. సూర్యాపేట లో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కాని ప్రహరీ గోడ లేకపోవడం వలన సెంటర్ రావడంలేదని ఆయన అన్నారు.ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ జూనియర్ కాలేజీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్,మాజీ కౌన్సిలర్ తహేర్ పాషా,బత్తుల జానీ,వల్దాస్ జానీ,చక్రహరి నాగరాజు, మోత్కూరి సందీప్, రాచకొండ కృష్ణ రామ్మూర్తి గౌడ్, కళాశాల డి ఐ ఈ ఓ బాను నాయక్,అధ్యాపకులు వాసు, ప్రసాద్, బషీరున్నిషా, సైదులు, గురువయ్య, నవీన్, చీకూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్

## గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి



**చందూర్, రాజముద్ర న్యూస్ :** చందూరు మండలం గన్ పూర్ గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ గౌస్, 14 సంవత్సరాలు వసతి గృహంలోని గదిలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ టి నరేష్ కుమార్ తో పాటు వార్డెన్ ముజాహిల్ తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంబాద్ పట్నంలోని ధర్మపురి హిల్స్ కు కాలానికి చెందిన షేక్ హమీద్ కుమారుడు షేక్ మూసాకు ఏడవ తరగతి చదువుతున్నప్పుడు ఈ వసతి గృహంలో చేర్పించినట్టు పేర్కొన్నారు. పోయిన శుక్రవారం నాడు తనకు చాతి నొప్పి ఉందని అదే విధంగా బర్త్ సర్టిఫికెట్ తేవాలని మృతుడు విద్యార్థి గౌస్ ఇంటికి వెళ్ళినట్టు తెలిపారు. ఇంటికి వెళ్లిన విద్యార్థి నిన్న అనగా ఆదివారం నాడు తన సోదరుడు సహకారంతో హాస్టల్ కు రావడం జరిగిందని అన్నారు. ఆదివారం సాయంత్రం స్టడీ క్లాసులు ముగిసిన తర్వాత విద్యార్థులు తమ రూమ్ కి వెళ్లడం జరిగిందని అన్నారు. రూమ్ లో ఉన్న విద్యార్థుల గదిలోకి సిబ్బంది రాత్రి 11 గంటల వరకు , రౌండ్స్ వేసి మాట్లాడడం జరిగిందని అన్నారు. సోమవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో విద్యార్థి గదిలోనే ఫ్యాన్ కు ఉరివేసుకొని చనిపోయినట్టు పేర్కొన్నారు. ఈ విషయం విద్యార్థుల ద్వారా తెలుసుకొని వారి బంధువులకు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు ఐదు గంటల 30 నిమిషాల ప్రాంతం లో రావడం జరిగిందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజాంబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. విద్యార్థి మృతికి కారణాలు ఇంకా ఏమీ తెలియ రాలేదు మొత్తానికి అనుమానస్పద స్థితిలో విద్యార్థి మృతి చెందినట్లు తెలుస్తుంది.

**వసతి గృహం ఎదుట పోలీసుల భారీ బందోబస్తు**

మైనార్టీ వెల్ఫేర్ వసతి గృహం ఎదుట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న తోపాటు పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం మీడియా వారికి విద్యార్థుల తల్లిదండ్రులకు లోనికి ప్రవేశం కల్పించడం జరిగింది. విషయం తెలుసుకున్న మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ తమ పిల్లలకు వచ్చి ధైర్యం చెప్పారు. ఏది ఏమైనా ఇలాంటి సంఘటన జరగడంతో మిగతా విద్యార్థులు అదేవిధంగా వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

## సర్పంచ్ ఎన్నికలలో

# బీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ

### రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై జిల్లాల వారీగా నోటిఫికేషన్లు జారీ అయ్యాయి అన్నారు జీవో నం.46 ప్రకారం 50శాతం రిజర్వేషన్లతో స్థానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.ఇందులో ఎస్సీ ఎస్టీ ల పంచాయతీలు యథాతథంగా ఉండగ, 22శాతం రిజర్వేషన్ మాత్రమే అమలు చేస్తుండటంతో పలుచోట్ల బీసీ రిజర్వేషన్లకు మాత్రమే అన్యాయం జరిగిందని బీసీలకు 46 శాతం రిజర్వేషన్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 22 శాతం ఇచ్చి పబ్బం గడుపుకుంటుందని స్థానిక సంస్థల్లో ఎస్సీ ఎస్టీ బీసీలకు సముచిత న్యాయం కలిపించకుంటే బీసీ రాజ్యాధికార పార్టీ పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పోరాటానికి సిద్ధపడతామని బిఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండు కూడా బీసీలపై మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నాయని 46శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే బీసీలు చూస్తూ ఊరుకోరని బీసీలంతా ఏకమైతే రాజ్యాధికారం బీసీల దేనని ఈ విషయాన్ని పెత్తందారులు బడా నాయకులు గుర్తుంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, రాజ్యాధికార పార్టీ నాయకులు ఆవుల అంజయ్య యాదవ్, వల్లాల సైదులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పత్రికలకు అండగా ఉంటా

### ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డికి ఘన సత్కారం



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** చిన్న పత్రికలకు అండగా ఉంటానని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సిరిగిరి విజయ్ కుమార్ రెడ్డి భరోసా కల్పించారు. చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న పలు సమస్యల సాధనకు తమ వంతు కృషి చేస్తానన్నారు. సోమవారం తెలంగాణ చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు దాస్ మాతంగిల ఆధ్వర్యంలో విజయ్ కుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఇటీవల హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కు జరిగిన ఎన్నికల్లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) బలపర్చిన నేతలు విజయకేతనం ఎగుర వేసిన విషయం విదితమే. సీనియర్ జర్నలిస్ట్ గా, జర్నలిస్టులకు పెద్దన్నగా చిన్న పత్రికల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చిన్న పత్రికల ఎడిటర్లకు ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు, ఇతర సమస్యలను ప్రస్తావించడంతో సానుకూలత వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో విజయ్ కుమార్ రెడ్డికి తొలుత శాలువా కప్పి, బొకే అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో.. తెలంగాణ స్మాల్ మీడియం డైలీ రాష్ట్ర అధ్యక్షులు మాతంగి దాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అహ్మద్ అలీ, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెన్నమల్ల రమేష్ బాబు, రాష్ట్ర కోశాధికారి కొమరాజు శ్రీనివాసులు రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుభాష్ రెడ్డి,, కోటగిరి చంద్రశేఖర్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎండి మక్సుద్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దగోని మధు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరల పంపిణీ

**నసల్రాబాద్, రాజముద్ర న్యూస్ :** నసల్రాబాద్ మండల కేంద్రంలో మహిళా మండలి లోని సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరా గాంధీ జన్మదినం సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేయడం చాలా సంతోషకరం అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రానించి, దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలన్నారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుపరుస్తుందన్నారు. మహిళలు డ్వాక గ్రూపులలో రుణాలు పొంది, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెత్కర్, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**కామారెడ్డి కలెక్టరేట్, రాజముద్ర న్యూస్ :** ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 84 దరఖాస్తులు వచ్చాయని అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన వివిధ సమస్యల పై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులు శాస్త్రీయ దృక్పతాన్ని అలవర్చుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి,రాజముద్ర న్యూస్:** సోమవారం స్ప్రింగ్ ఫీల్డ్స్ హై స్కూల్ లో జరుగుతున్న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన లో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగ ఎగ్జిబిట్లను అభినందిస్తూ కామారెడ్డి జిల్లాలలో అట్టహాసంగా 550 ప్రాజెక్టులు, ఇన్స్పైర్లో 91 ప్రాజెక్టులు పాల్గొనడం పిల్లల్లో ఉన్న శాస్త్రీయ దృక్పథానికి నిదర్శనమని తెలుపుతూ, ప్రతి విద్యార్థి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని శాస్త్రీయ దృక్పథాన్ని శాస్త్రీయ ఆలోచనను పెంపొందించుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సిద్ధిరామిరెడ్డి వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



## ఘనంగా ఆయుబ్ ఖాన్

# పుట్టినరోజు వేడుకలు

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ఉమ్మడి నల్గొండ జిల్లా ఎన్ఎస్ఏ అధ్యక్షులు,ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్ పుట్టినరోజు వేడుకలు దుర్గా డ్రైవింగ్ స్కూల్ యందు ఘనంగా నిర్వహించరు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా చిరంజీవి యువత అధ్యక్షులు భైరు వెంకన్న గౌడ్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్ వై ఎల్ ఎన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎంవిఎల్, దుర్గా డ్రైవింగ్ స్కూల్ అధినేత కొక్కు సోమేశ్వర్,సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ నాయకులు కోలా నాగరాజు,కమ్మాల అశోక్,అంతటి సైదులు,గడ్డం చంద్రశేఖర్ బాణాల రాము తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## వజ్రేష్ యాదవ్‌ను

# సన్మానించిన బండారి రవీందర్

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ మల్కాజ్ గిరి డిసిసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి రవీందర్, విహారిక కాలనీ అధ్యక్షులు సంఘపాక సుధాకర్, ఏవి రమణారెడ్డి, దంతూరి వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తి సుమిత్ పాల్ రెడ్డి వజ్రేష్ యాదవ్ ను సన్మానించడం జరిగినది.



# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

## రెండు బస్సులు ఢీకొని ఆరుగురి మృతి


**చెన్నై, నవంబర్ 24 :** తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తెనకాశీ-మదురై రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ప్రైవేటు బస్సులు ఒకదాన్నొకటి ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మదురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు.. తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం దాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, సీసీటీవీ ఫుటేజ్‌లను సేకరిస్తున్నామని తెలిపారు. ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.




# ఇంధన దిగ్గజం దివాలా..

## వేలాది మంది భారతీయ ఉద్యోగుల్లో ఆందోళన

**బ్రిటన్ :** బ్రిటన్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఇంధన సేవల సంస్థ 'పెట్రోఫాక్' దివాలాకు వెళ్లింది. ఇంధన సేవల్లో ఒకప్పుడు దిగ్గజ సంస్థగా పేరొందిన పెట్రోఫాక్.. అవినీతి, కుంభకోణాల్లో చిక్కుకుంది. దీంతో ఆర్థికంగా కుప్పకూలింది. ఇప్పటికే వందల మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగించగా.. ఇందులో పనిచేస్తున్న మిగతా వారి భవిష్యత్తు కూడా ఆందోళనకరంగా మారింది. ఈ ఉద్యోగుల్లో భారతీయులు కూడా ఉన్నారు. మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా ప్రాంతంలో పెట్రోఫాక్ దిగ్గజ ఇంధన సేవల సంస్థగా గుర్తింపు సాధించింది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి బిలియన్ డాలర్ల ఒప్పందాలు చేసుకుంది. అయితే, 2011లో ఈ కంపెనీ ఎగ్జిక్యూటివ్స్ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. కాంట్రాక్టులు కుదుర్చుకునేం దుకు అధికారులకు లంచాలు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ. దీంతో న్యాయపరమైన చిక్కులు మొదలయ్యాయి. 2017 మే నెలలో యూకే సీరియస్ ఫ్రాడ్ ఆఫీస్.. ఈ కంపెనీపై దర్యాప్తు ప్రారంభించింది. అక్కడి నుంచి పెట్రోఫాక్ పరపతి దిగజారుతూ వచ్చింది. 2019లో ఈ కంపెనీ మాజీ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ లుఫ్కిన్ లంచం కేసులో దోషిగా తేలారు. విచారణలో అతడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా చేసుకొని.. కంపెనీపై న్యాయస్థానం 77 మిలియన్ పౌండ్ల జరిమానా విధించింది. ఈ తీర్పు పెట్రోఫాక్‌కు ఆర్థికంగా భారీ నష్టం చేకూర్చుకుంది. కీలక ఒప్పందాలు రద్దవడంతో ఆదాయం లేకుండా పోయింది. ఫలితంగా రుణభారం పెరిగింది. ప్రస్తుతం ఈ కంపెనీ 4 బిలియన్ డాలర్ల మేర అప్పుల్లో ఉందని అంచనా. బ్యాలెన్స్ షీట్‌ను పునరుద్ధరించుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో చేసేదేం లేక.. ఇటీవల దివాలా ప్రక్రియకు దరఖాస్తు చేసుకుంది. అదే సమయంలో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నుంచి డీలిస్ట్ అయ్యింది. దీంతో కంపెనీ భవిష్యత్తుపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే యూఏఈలోని ఈ కంపెనీలో వందల మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఈ కంపెనీకి భారత్‌లో 8,500 మంది వరకు ఉద్యోగులున్నారు. దీంతో వారి భవిష్యత్తుపై గందరగోళం నెలకొంది.




# పాక్ పారా మిలిటరీ ప్రధాన కార్యాలయంపై ఆత్మాహుతి దాడులు

**పెషావర్ :** పాకిస్థాన్‌లో మంగళవారం ఆత్మాహుతి దాడి చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు పారా మిలిటరీ సిబ్బంది మరణించగా.. పలువురు గాయపడ్డారు. పెషావర్‌లోని ఫ్రంటియర్ కోర్ ప్రధాన కార్యాలయంపై ఉగ్రవాదులు దాడులు చేయడంతో పారామిలిటరీ కార్యాలయం కాంపౌండ్ లోపల వరుస పేలుళ్లు సంభవించినట్లు పాక్ అధికారులు వెల్లడించారు. పాక్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున పెషావర్‌లోని ఫ్రంటియర్ కోర్ ప్రధాన కార్యాలయం గేట్ వద్ద పేలుడు సంభవించింది. అనంతరం సమీపంలోని సైకిల్ స్టాండ్ వద్ద మరో పేలుడు చోటుచేసుకుంది. కార్యాలయాన్ని ముగ్గురు ఉగ్రవాదులు ముట్టడించినట్లు కనుగొన్న భద్రతా బలగాలు వారిపై కాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు పారామిలిటరీ సిబ్బంది మరణించగా.. నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బాంబు దాడి జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో లాక్‌డౌన్ విధించినట్లు తెలిపారు. భద్రతా బలగాలు, స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడులకు సంబంధించి బాధ్యత వహిస్తూ ఏ ఉగ్ర సంస్థ ఇంతవరకు ప్రకటన చేయలేదు.

# మరోమారు కుత్సిత బుద్ధిని చాటుకున్న చైనా

- అరుణాచల్ యువతికి చైనాలో అవమానం
- పాస్‌పోర్ట్ ఉన్నా.. చెల్లదని వేధింపులు



**న్యూఢిల్లీ, నవంబర్ 24 :** చైనా మరోమారు తన కుత్సిత బుద్ధిని చాటుకుంది. అరుణాచల్ తమదే అన్న వాదన కోసం ఏ చిన్న అవకాశం దొరికినా వదలడం లేదు. తాజాగా ఇలాంటి ఘటన కలకలం రేపింది. చైనాలో షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో భారత మహిళకు వేధింపులు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ చైనాదే అంటూ తన భారత పాస్‌పోర్ట్‌ను గుర్తించేందుకు ఆ దేశ అధికారులు నిరాకరించారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈనెల 21న పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. అయితే ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనా నగరం షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. అందులో తాను పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ అని ఉందని వెల్లడించారు. అది చూసిన తర్వాత ఇమిగ్రేషన్ అధికారులు తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించారని ఆమె ఆరోపించారు. వారు ఆ ఈశాన్య రాష్ట్రాన్ని చైనాలో భాగమని పట్టుబట్టారన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనవైపు చూసి నవ్వారని, చైనీస్ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోమని హేళన చేశారని ఆమె వాపోయారు. చెల్లుబాటు అయ్యే వీసా ఉన్నా కూడా తన పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారని, జపాన్ వెళ్లే విమానం ఎక్కనివ్వలేదని మీడియాకు వెల్లడించారు. తనను ట్రాన్సిట్ ఏరియాకే పరిమితం చేశారని, మళ్లీ టికెట్లు బుక్ చేసుకోనివ్వలేదని, చివరకు ఆహారం కొనేందుకు కూడా అంగీకరించలేదన్నారు. యూకేలోని ఫ్రెండ్ ద్వారా షాంఘైలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదిం చిన తర్వాతే తనకు సహాయం అందిందని పేర్కొన్నారు. భారత అధికారుల సహాయంతోనే తాను అక్కడి నుంచి బయట పడినట్లు చెప్పారు. అలాగే దీనిపై తాను ప్రధాని మోదీకి, ఇతర సీనియర్ అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. ఇదంతా భారత సార్వభౌమత్వాన్ని, అరుణాచల్ ప్రదేశ్ ప్రజల ను అవమానించడమేనని ఆ లేఖలో అభివర్ణించారు. ఈ పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ ప్రస్తుతం యూకేలో నివసిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి స్పందనా రాలేదు.

# భారీగా పెరిగిన చమురు ట్యాంకర్ల ధరలు

## అమెరికా ఆంక్షల ఎఫెక్ట్



**న్యూఢిల్లీ :** రష్యా ప్రధాన చమురు సంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిం దే. దీంతో ముడిచమురు కొనుగోలుదారులు ప్రత్యామ్నాయా లపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలో చమురు రవాణా చేసే సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు అమాంతం పెరిగాయని అంతర్జా తీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇవి ఐదేళ్ల అత్యధి కానికి చేరుకున్నాయని వెల్లడించాయి. పుతిన్ అనుచితంగా చేస్తున్న యుద్ధానికి ప్రతిగా రష్యాలోని అతిపెద్ద చమురు కంపెనీలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌లపై ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ఆంక్షలు నవంబరు 21 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఈ సంస్థల నుంచి ప్రధానంగా చమురు కొనుగోళ్లు జరుపుతోన్న భారత, చైనీస్ రిఫైనరీలు ఇప్పటికే అప్రమత్తమయ్యాయి. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించుకున్నాయి. ఆ సమయంలో డిమాండ్‌కు అనుగుణంగా మధ్యప్రాచ్యం, అమెరికా ఉత్పత్తి దారుల నుంచి దిగుమతి పెంచాయని ఆ కథనాలు పేర్కొన్నా యి. నిర్దిష్ట మార్గాల్లో మధ్యప్రాచ్యం నుంచి చైనాకు 2 మిలియన్ బారెళ్ల చమురును రవాణా చేయగల క్యారియర్ల ధర గత వారం నాటికి రోజుకు 1,37,000 డాలర్లకు పెరిగిం ది. అంటే ఈ ఏడాదిలో 576 శాతం పెరిగిందని వెల్లడిం చాయి. 2020 తర్వాత ఇదే అత్యధిక ధర కావడం గమనా ర్హం. ఇదిలాఉంటే.. సమీప భవిష్యత్‌లో రష్యా నుంచి మన దేశ చమురు దిగుమతులు గణనీయంగా తగ్గొచ్చని, అయితే అవి పూర్తిగా ఆగిపోవని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది రష్యా నుంచి మన దేశ ముడిచమురు దిగుమతు లు రోజుకు సగటున 1.7 మిలియన్ బ్యారెళ్లుగా ఉన్నాయి. రిఫైనరీ సంస్థలు రాయితీ కొనుగోళ్లను అధికం చేయడంతో గత నెలలో ఇవి రోజుకు 1.8- 1.9 మిలియన్ బ్యారెళ్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే డిసెంబరు, జనవ రిలో మాత్రం దిగుమతులు గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమీప కాలంలో రోజుకు 4 లక్షల బ్యారెళ్లకు పరిమితం కావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అమెరికాలో 'డోజ్' విభాగం మూసివేత

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం డొనాల్డ్ ట్రంప్ దేశంలోని వృథా ఖర్చులను తగ్గించడం, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ శాఖను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. తాము అనుకున్న లక్ష్యాలను సాధించిన అనంతరం అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2026 జులై 4వ తేదీలోపు ఈ ఫెడరల్ బ్యూరోక్రసీని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని అప్పట్లోనే ట్రంప్ ప్రకటించారు. అయితే దాని గడువు కంటే ఎనిమిది నెలల ముందే డోజ్‌ను మూసివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం వెల్లడించింది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులోభాగంగా ఏర్పాటుచేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ విభాగానికి ఎలాన్ మస్క్‌ను, భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలను సంయుక్త సారథులుగా నియమించారు. ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులు, శాఖల్లో వృథా ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా ఇది పని చేస్తుందని చెప్పిన ట్రంప్.. ఆవిధంగానే వివిధ శాఖల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించారు. అనంతరం రామస్వామి డోజ్ నుంచి వైదొలిగారు. ఈ క్రమంలో మస్క్ తీరుపై తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. ట్రంప్ యంత్రాంగాన్ని ఎలాన్ మస్క్ వెనకుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో డోజ్‌లో మస్క్ ఉద్యోగి కాదని.. ట్రంప్ సలహాదారుడిగా మాత్రమే మస్క్ ఆ బాధ్యతలు చూస్తున్నారని వైట్‌హౌస్ వెల్లడించింది.

ఈ ఏడాది మేలో ట్రంప్ తీసుకువచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్‌ను మస్క్ వ్యతిరేకించడంతో ట్రంప్‌నకు, ఆయనకు మధ్య విభేదాలు వచ్చాయి. ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి డోజ్ తీసుకున్న చర్యలు ఈ నిర్ణ యంతో వృథా అవుతాయని మస్క్ నిరాశ వ్యక్తంచేస్తూ.. ట్రంప్ కార్యవర్గం నుంచి వైదొలిగారు. తాను లేకపోయినా డోజ్ చర్యలు కొనసాగుతాయని తెలిపారు. అయితే డోజ్ నుంచి మస్క్ బయటకు వచ్చినప్పటినుంచి ఆ శాఖలో చర్యలు మం దగించినట్లు అమెరికా మీడియా వర్గాలు వెల్లడించాయి.

# ఉక్రెయిన్‌కు కృతజ్ఞత లేదన్న ట్రంప్..

## వెంటనే థ్యాంక్స్ చెప్పిన జెలెన్‌స్కీ



**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో శాంతి ప్రణాళికను ఒప్పించేందుకు ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. దీనిలో భాగంగా ఆయన ఉక్రెయిన్ ప్రభుత్వానికి కొంచెం కూడా కృతజ్ఞత లేదంటూ ట్రూత్‌లో పోస్టు చేశారు. మరోవైపు ఆంక్షలు ఉన్నా ఐరోపా దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూనే ఉన్నాయని ఆరోపించారు. తాను అధికారంలో ఉంటే ఉక్రెయిన్-రష్యా యుద్ధం అసలు జరిగేదే కాదని పేర్కొన్నారు. ఈ పోస్టు సంచలనం సృష్టించింది. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన స్పందనను ఎక్స్ వేదికగా బలంగా వినిపించారు. తొలుత ఆయన అమెరికాకు ధన్యవాదాలు తెలిపారు. జావెలిన్ క్షిపణులు ఇచ్చి ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలను కాపాడారని చెప్పారు. తాము శాంతి, దౌత్యం, అంతర్జాతీయ సహకారానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమకు మద్దతు, సలహాలు, సమాచారం అందించి సహకరించారన్నారు. శాంతి ఎప్పుడు సుస్థిరంగా ఉండాలని కోరారు.

# రూపాయి పతనంపై మండిపడ్డ కాంగ్రెస్

## ఆనాటి విమర్శల వీడియోను పోస్ట్ చేసిన జైరామ్



**న్యూఢిల్లీ, నవంబర్ 24 :** అమెరికా డాలర్‌తో పోలిస్తే.. రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది. శుక్రవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89 రూపాయలకి పడిపోయింది. రూపాయి విలువ రికార్డు స్థాయిలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోవడంతో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేసింది. 2013 యుపిఎ హయాంలో రూపాయి విలువ పడిపోవడంతో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో కాంగ్రెస్ కూడా మోడీపై మండిపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ నిరంతరం పతనం అవుతూనే ఉంది. ఇప్పుడు అది 90 రూపాయల కనిష్ట స్థాయిని దాటబోతోంది. 2013 జూలైలో తాను చెప్పింది ప్రధానికి గుర్తుందా అని అప్పుడు మోడీ అన్న వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పోస్టు చేశారు. రూపాయి ఎంత వేగంగా పతనమవుతుందో చూడండి. కొన్నిసార్లు రూపాయి, ఢిల్లీలో ప్రభుత్వానికి మధ్య పోటీ జరుగు తున్నట్లు అనిపిస్తుంది. అయితే రూపాయి పతనంపై దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేసినా.. అలా అన్న వారి గౌరవం కూడా వేగంగా దిగజారిపోతుంది అని జైరాం రమేశ్ ఈ వీడియోకు జతగా పోస్టు చేశారు. 022 ఫిబ్రవరి 24వ తేదీన రూపాయి విలువ 99 రూపాయలకి పడిపోయింది. గత మూడు సంవత్సరా లుగా అత్యంత కనిష్ట స్థాయిలోనే రూపాయి విలువ పడిపోతుంది.




# ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం

**ముంబయి, నవంబర్ 24 :** ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. ముంబయి నుంచి డెహ్రాడూన్ కు బయల్దేరిన ఇండిగో విమానాన్ని మార్గం మధ్యలో ఆకస్మాత్తుగా ఓ పక్షి ఢీకొంది. అప్రమత్తమైన పైలట్.. వెంటనే విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ క్రమంలో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. అయితే.. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయాన్ని ఇండిగో సంస్థ అధికార ప్రతినిధి ఒకరు అధికారికంగా వెల్లడించారు. ఆ సమయంలో విమానంలో సుమారు 186 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ప్రత్యామ్నాయంగా మరో విమానం ద్వారా సర్వీసును పునరుద్ధరించింది ఎయిర్‌ఇండియా. ఈ స్వల్ప విరామంలో ప్రయాణికులకు విమానయాన సిబ్బంది అల్పాహారం అందించినట్టు అధికారులు తెలిపారు.

# బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి

## కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స



**ముంబై, నవంబర్ 24 :** భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర కన్ను మూశారు. సోమవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ధర్మేంద్ర నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు. 89 ఏండ్ల ధర్మేంద్ర గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పది రోజుల క్రితం ముంబైలోని క్యాండి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. అప్పటినుంచి ఆయన ఆరోగ్యంపై రకరకాలుగా వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకూ ధర్మేంద్ర వెంటిలేటర్‌పై ఉన్నారంటూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. 1958లో దిల్ బీ తేరా హమ్ బీ తేరే చిత్రంతో తెరంగేట్రం చేసిన ధర్మేంద్ర, తన కెరీర్‌లో 'షోలే', 'చుప్కే చుప్కే', 'ధర్మ్ వీర్', 'సీతా ఔర్ గీత', 'యాదోం కి బారాత్' వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు 'హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్' అనే బిరుదు ఇచ్చారు. ధర్మేంద్ర నటించిన తాజా చిత్రం 'ఇక్కీస్ విడుదలకు సిద్ధమవుతోంది. ఇది పరమవీర చక్ర గ్రహీత లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం. ఇందులో ఆయన హీరో తండ్రి పాత్రలో కనిపించను న్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఇదిలావుంటే బాలీవుడ్ స్టార్ ధర్మేంద్ర అంత్యక్రియలను అత్యంత గోప్యంగా నిర్వహించారు. ముంబైలోని పవన్ హన్స్ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు చేపట్టారు. వార్త తెలిసన వెంటనే ధర్మేంద్ర భార్య , ప్రఖ్యాత నటి హేమామాలిని, ధర్మేంద్ర కుమార్తె ఈషా డియోల్.. శ్మశానవాటికకు చేరుకున్నారు.

# నష్టాల్లో సూచీలు.. 26వేల దిగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం వంటి కారణాలతో సూచీలు నష్టపోయాయి. దీంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 26వేల స్థాయిని కోల్పోయింది. సెన్సెక్స్ ఉదయం 85,320.04 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 5,231.92) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు మోస్తరు లాభాల్లో కొనసాగిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 84,710.11 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 331.21 పాయింట్ల నష్టంతో 84,900.71 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.65 పాయింట్ల నష్టంతో 25,959.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.19గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, టీఎంపీవీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4072 డాలర్ల వద్ద కొనసాగుతోంది.






# అమల్లోకి లేబర్ కోడ్‌లు..

## చేతికొచ్చే వేతనం తగ్గనుందా?

అమల్లో ఉన్న కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కొత్త కోడ్‌లను కేంద్రం తీసుకువచ్చింది. దీంతో వేతన గణనలో కీలక మార్పు చోటుచేసుకోబోతోంది. మొత్తం వేతనంలో అలవెన్సులు 50 శాతం మించరాదని కొత్త నిబంధనలు చెబుతున్నాయి. దీంతో ఆ మేర శాలరీ విధానంలో మార్పులొచ్చి చేతికందే వేతనం తగ్గనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏళ్లుగా ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో వేతనాల కోడ్- 2019, సామాజిక భద్రతా కోడ్- 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్- 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్- 2020లను కేంద్రం తీసుకొచ్చింది. ఈ నెల 21 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీనికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలను 45 రోజుల్లో కేంద్రం వెలువరించనుంది. ఆ నిబంధనలను అనుసరించి ఆ మేర శాలరీ విధానంలో కంపెనీలు తమ శాలరీ విధానాన్ని మార్పు చేసుకోవాల్సి ఉంటుంది. వేతనాల్లో కోడ్‌లో 'వేతనం' అనే పదాన్ని నిర్వచించారు. దీని ప్రకారం అలవెన్సులు 50 శాతానికి మించి ఉండకూడదు. అంటే బేసిక్, డియర్‌నెస్ అలవెన్సు, రిటైనింగ్ అలవెన్సు వంటివి 50 శాతం ఉండాలి. ప్రస్తుతం చాలా కంపెనీలు బేసిక్‌డీఏ తక్కువగా చూపుతూ అలవెన్సుల రూపంలో ఎక్కువగా చెల్లిస్తుంటాయి. కొత్త చట్టం ప్రకారం.. వేతన గణన మార్చాల్సి ఉంటుంది. దీంతో వేతనం పెరిగినప్పుడు ఆ మేర పీఎఫ్ కాంట్రిబ్యూషన్ మొత్తం పెరుగుతుంది. దీనివల్ల చేతికొచ్చే వేతనం తగ్గుతుంది. రిటైర్మెంట్ తర్వాత వచ్చే మొత్తంతో పాటు, గ్రాట్యూటీ ఎక్కువ మొత్తంలో లభిస్తుంది. ప్రస్తుతం బేసిక్ శాలరీలో 12 శాతం పీఎఫ్ మొత్తం కింద వెళుతుంది. ఒకవేళ వేతనం పెరిగితే ఆ మేర పీఎఫ్ మొత్తం కూడా పెరుగుతుంది. గ్రాట్యుటీ మొత్తం కూడా వేతనాన్ని బట్టే గణిస్తారు కాబట్టి ఆ మేర ఆ మొత్తం కూడా పెరుగుతుంది. సవరించిన వేతన విధానం వల్ల చేతికొచ్చే జీతం తగ్గినా.. రిటైర్మెంట్ సమయంలో వచ్చే ప్రయోజనాలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కంపెనీలు వేతన విధానంలో ఆ మేర మార్పులు చేయాలి. అలాగని సీటీసీలో ఎలాంటి మార్పూ ఉండదు.

# కుప్పకూలిన టీమిండియా

## భారీ ఆధిక్యంలో దక్షిణాఫ్రికా..

## మూడో రోజు ముగిసిన ఆట





**గువాహటి:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా పూర్తిగా పట్టుబిగించింది. ఇటు బంతితో, అటు బ్యాట్‌తో విఫలమైన టీమ్‌ఇండియా ఈ మ్యాచ్‌లో గెలుపు ఆశలను దాదాపు వదులుకున్నట్లే! ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉన్నందున ఇప్పటికైనా గట్టిగా పోరాడితే మ్యాచ్‌ను డ్రాగా ముగించడానికి అవకాశముంది. 9/0తో మూడో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. 201 పరుగులకే ఆలౌటైంది. సఫారీ పేసర్ మార్కో యాన్సెన్ (6/48) విజృంభించాడు. 288 పరుగులు వెనుకబడిన భారత్‌ను 'ఫాలోఆన్' ఆడించడానికి అవకాశం ఉన్నా సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ఆడటానికి మొగ్గుచూపింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 26/0 స్కోరుతో నిలిచింది. రికెల్‌టన్ (13బి), మార్‌క్రమ్ (12బి) క్రీజులో ఉన్నారు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మార్‌క్రమ్‌కు లైఫ్ దొరికింది. సెకండ్ స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ అతను ఇచ్చిన కాస్త కష్టతరమైన క్యాచ్‌ను అందుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించినా విఫలమయ్యాడు. దక్షిణాఫ్రికా ప్రస్తుతం 314 పరుగుల ఆధిక్యంలో ఉంది. భారత్ టాప్-7 బ్యాటర్లలో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (58బీ 97 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే రాణించాడు. ఒకదశలో 95/1తో మెరుగైన స్థితిలో కనిపించిన భారత్.. తర్వాత అనూహ్యంగా వికెట్లు చేజార్చుకుని 122/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ (22), సాయి సుదర్శన్ (15) విఫలమయ్యారు. ధ్రువ్ జురెల్ (0), రిషభ్ పంత్ (7), రవీంద్ర జడేజా (6), నితీశ్ కుమార్ రెడ్డి (10) ఘోరంగా నిరాశపర్చారు. ఈ క్రమంలో వాషింగ్టన్ సుందర్ (48బీ 92 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), కుల్‌దీప్ యాదవ్ (19, 134 బంతుల్లో) పోరాడారు. ఈ జోడీ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం (208 బంతుల్లో) నెలకొల్పింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ (6/48) భారత్‌ను దెబ్బకొట్టాడు. సైమన్ హార్మర్ 3, కేశవ్ మహరాజ్ ఒక వికెట్ తీశారు.



# పెళ్లి వాయిదా..

## పోస్టులు డిలీట్ చేసిన స్మృతి మంధాన..

భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన వివాహం చివరి నిమిషంలో వాయిదా పడిన సంగతి తెలిసిందే. పెళ్లి వేడుకలు జరుగుతుండగా.. స్మృతి తండ్రి అనారోగ్యానికి గురవడంతో వివాహ సంబరాలను నిలిపివేశారు. అయితే, తాజాగా ఆమె ఇన్‌స్టా ఖాతాలో పెళ్లికి సంబంధించిన పోస్టులు కన్పించకపోవడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. తన స్నేహితుడు, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్‌తో ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ ఇటీవల స్మృతి మంధాన తన ఇన్‌స్టాలో ఓ వీడియోను షేర్ చేసిన సంగతి తెలిసిందే. సహచర క్రికెటర్లతో కలిసి 'సమ్‌జో హెూ హి గయా' బాలీవుడ్ సాంగ్‌కు స్మృతి మంధాన డ్యాన్స్ చేసింది. ఈ సందర్భంగా తన వేలికి ఎంగేజ్‌మెంట్ రింగ్ ఉందంటూ చూపించింది. ప్రస్తుతం ఈ వీడియో ఆమె ఇన్‌స్టాలో కన్పించకపోవడంతో నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఇదే వీడియోను స్మృతి స్నేహితురాళ్లు జెమీమా, శ్రేయాంక కూడా సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడం గమనార్హం. అయితే, ఈ వీడియోను ఆమె డిలీట్ చేసిందా? లేదా హైడ్ చేసిందా? అన్నదానిపై స్పష్టత లేదు. మరోవైపు పలాశ్ ముచ్చల్ ఇన్‌స్టా ఖాతాలో ప్రపోజల్ వీడియో మాత్రం అలాగే ఉంది. భారత మహిళలు వన్డే క్రికెట్ ప్రపంచకప్ గెలిచిన నవీ ముంబయి స్టేడియంలో స్మృతి వేలికి ఉంగరం తొడుగుతూ పలాశ్ పెళ్లి ప్రతిపాదన చేసిన వీడియో అది. వాస్తవానికి స్మృతి-పలాశ్ వివాహం నవంబరు 23 బెంగళూరు వేదికగా జరగాల్సి ఉంది. అయితే, వివాహ వేడుకల్లో పాల్గొంటుండగా స్మృతి తండ్రి అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి పరిస్థితుల్లో తనకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని, అందుకే పెళ్లిని వాయిదా వేయాలని స్మృతి నిర్ణయం తీసుకున్నట్లు ఆమె మేనేజర్ ప్రకటించారు. ఇదిలా ఉండగా.. పలాశ్ కూడా అనారోగ్యానికి గురయ్యారు. ఇన్ఫెక్షన్, ఎసిడిటీతో బాధపడటంతో ఆసుపత్రిలో చేరిన అతడు చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. వీరిద్దరూ 2019 నుంచి రిలేషన్‌లో ఉండగా.. గతేడాది వీరి ప్రేమ గురించి బయటపడింది.

# తిలక్ వర్మను

# నాలుగో స్థానంలో ఆడించాలి

**ఇర్ఫాన్ పఠాన్**




భారత యువ బ్యాటర్ తిలక్ వర్మను వన్డేల్లో నాలుగో స్థానంలో ఆడించాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. నవంబర్ 30 నుంచి దక్షిణాఫ్రికాతో టీమ్‌ఇండియా మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. దీనికి సంబంధించి 15 మంది సభ్యులతో కూడిన జట్టును బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. మెడ గాయం కారణంగా శుభ్‌మన్ గిల్ జట్టుకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో కేఎల్ రాహుల్ టీమ్‌ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. స్టార్ బ్యాటర్ రిషభ్ పంత్ సైతం దాదాపు సంవత్సరం తర్వాత వన్డే జట్టులోకి పునరాగమనం చేశాడు. అలాగే రుతురాజ్ గైక్వాడ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియా టూర్‌లో వన్డే జట్టులో స్థానం కోల్పోయిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఈ సిరీస్‌కు ఎంపికయ్యాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే శ్రేయస్ అయ్యర్ కూడా గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో ఆసియాకప్ హీరో తిలక్ వర్మను సెలక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. ఈ విషయమై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా స్పందించాడు. 'తిలక్ వర్మ వన్డేల్లోనూ అద్భుతంగా రాణించగలడు. అతడు ఆసియా కప్ ఫైనల్స్‌లో (టీ20 ఫార్మాట్లో) పాకిస్థాన్‌పై, టీమ్‌ఇండియా నెగ్గడంలో కీలకపాత్ర పోషించాడు. టీ20ల్లో అతడు నం.3 స్థానంలో చక్కగా రాణించగలడు. కానీ తిలక్ వర్మ వన్డేల్లో నాలుగో స్థానానికి సరిగ్గా సరిపోతాడు. అతడు మొదట క్రీజులో పాతుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. తర్వాత ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు చేస్తాడు. అలాగే స్లాగ్ స్వీప్ అద్భుతంగా ఆడగలడు. ఇంకా వికెట్ల మధ్య కూడా చక్కగా పరుగులు తీయగలడు' అని ఇర్ఫాన్ విశ్లేషించాడు. తిలక్ వర్మ.. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా అయిదు వికెట్లతో విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే.

# కబడ్డీ వరల్డ్‌కప్ విజేతగా భారత్



ఢాకా వేదికగా జరిగిన టైటిల్ పోరులో భారత్ తొలి అర్ధ భాగంలో 20-16తో ఆధిక్యం సంపాదించింది. సంజూ దేవి సూపర్ రెయిడ్‌లో నాలుగు పాయింట్లు తెచ్చి సత్తా చాటగా.. రీతూ నేగి ట్యాకిల్‌కు యత్నించి గాయపడింది. ఇక సెకండాఫ్‌లోనూ భారత్ తమ పట్టును మరింత బిగించేందుకు ప్రయత్నించింది. అయితే, చైనీస్ తైపీ కూడా అంత తేలికగా తలొగ్గలేదు. సమయం ముగియడానికి ఇంకా ఐదు నిమిషాలు ఉందన్న సమయంలోనూ చైనీస్ తైపీ పోరాట పటిమ కనబరిచింది. అయితే, భారత జట్టు వారికి మరో అవకాశం ఇవ్వలేదు. 35-28తో చైనీస్ తైపీని ఓడించి జగజ్జేతగా అవతరించింది. తద్వారా..డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. వరుసగా రెండోసారి వరల్డ్‌కప్ టైటిల్ సొంతం చేసుకుని సత్తా చాటింది. కాగా భారత పురుషుల కబడ్డీ జట్టు కూడా ఇప్పటికి మూడు ప్రపంచకప్ టోర్నీలు జరుగగా.. మూడింట చాంపియన్‌గా నిలిచింది. మహిళా జట్టు సైతం అదే పరంపరను కొనసాగించడం విశేషం. ఇప్పటికి ఓవరాల్‌గా ఐదు ప్రపంచకప్ టోర్నీ (3 పురుష, 2 మహిళలు)లు జరుగగా ఐదింట భారత్‌దే విజయం. కబడ్డీలో మన గుత్తాధిపత్యం కొనసాగిస్తున్నందుకు ఇరుజట్లకు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇదిలా ఉంటే.. గ్రూప్ దశలో భారత్ అన్ని మ్యాచ్‌లు గెలిచింది, గ్రూప్-'ఎ' నుంచి నాలుగుకు నాలుగు గెలిచి అజేయంగా నిలిచింది.




# మరో వ్యాపారంలోకి అదానీ గ్రూప్?

## ఏవియేషన్‌పై మరింత పట్టు

**ముంబయి:** అదానీ గ్రూప్ తమ వ్యాపారాలను చాలా వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే వివిధ రంగాల్లోకి అడుగుపెట్టిన ఈ కంపెనీ తాజాగా మరో సెక్టార్‌లోకీ ప్రవేశించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. తమ అనుబంధ సంస్థ అయిన డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ద్వారా పైలట్లకు శిక్షణనిచ్చే సంస్థను ప్రారంభించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటిగా ఉన్న 'ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్'ని కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ కంపెనీకి గురుగ్రామ్, హైదరాబాద్, ముంబయిలో సిమ్యులేటర్ సెంటర్లు ఉన్నాయి. హరియాణా, సూరత్, సోలాపూర్‌లో శిక్షణా కేంద్రాలు ఉన్నాయి. ప్రైమ్ ఏరో, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ మధ్య 50:50 జాయింట్ వెంచర్‌గా ఉన్న 'హొరైజాన్ ఏరో సొల్యూషన్స్' ద్వారా ఈ కొనుగోలును చేపట్టనున్నారు. ఏడీఎస్‌టీ.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ. 'ప్రైమ్ ఏరో'కు ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ కుమారుడు ప్రజయ్ పటేల్ ప్రమోటర్‌గా ఉన్నారు. చాలా వేగంగా తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఆ దిశగా కొత్త కంపెనీలను ఏర్పాటు చేస్తోంది. ఈ రంగంలో ఇప్పటికే ఉన్న సంస్థలను కొనుగోలు చేస్తోంది. 2024లో 'ఎయిర్ వర్క్స్'లో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. దీంతో విమానాల నిర్వహణ, మరమ్మతుల వ్యాపారంలోకి అడుగుపెట్టింది. రాబోయే కొన్నేళ్లలో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో అదానీ గ్రూప్ భారీ వృద్ధిని అంచనా వేస్తోంది. అందుకే పెట్టుబడులను పెంచుతోంది. దాదాపు రూ.5,000 కోట్లు ఇప్పటికే కేటాయించింది. రాబోయే కొన్నేళ్లలో దీన్ని మరింత పెంచే యోచనలో ఉంది. భౌగోళిక అస్థిరతల కారణంగా రక్షణ రంగంలో పైలట్లకు భారీ డిమాండ్ పెరిగింది. అలాగే కమర్షియల్ ఏవియేషన్‌కు కూడా గిరాకీ పుంజుకుంటోంది. ఈ తరుణంలో అదానీ గ్రూప్ ఈ రంగంలోకి ప్రవేశిస్తుండటం విశేషం.

# భారత్‌కు భారీ డిస్కౌంట్‌తో రష్యన్ ఆయిల్




రష్యా చమురు వ్యాపారంలో అమెరికా ఆంక్షలు కొత్త మార్పులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై ఆంక్షలు అమల్లోకి రావటంతో క్రూడాయిల్ ధరలు రికార్డు స్థాయిలో తగ్గాయి. దీంతో భారత్‌కు చమురు సరఫరా చేసే విధానం మారింది. ఇది మన రిఫైనరీలకు భారీ లాభాలను అందించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారత్‌కు సరఫరా అయ్యే ముడిచమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి. రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా ఆంక్షలు విధించాక లాభదాయకంగా ఉన్న అక్కడి చమురు వ్యాపారం తారుమారైంది. ప్రస్తుతం రష్యా ప్రధాన చమురు అయిన ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు ధర కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించడానికి సిద్ధమయ్యారు. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు కేవలం మూడు డాలర్లుగా ఉండేది. ఈ కొత్త ఆఫర్ డిసెంబరులో లోడ్ చేసి, జనవరిలో భారత్‌కు చేరే చమురుకు వర్తిస్తుంది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ భారీగా కొనుగోలు చేస్తూ వచ్చింది. కానీ, నవంబర్ 21 నుంచి ఆంక్షలు అమల్లోకి రావటంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. అయితే, ఈ వారంలో ఉరల్స్ చమురు ధర బాగా తగ్గడంతో భారత రిఫైనరీల వైఖరి మారింది. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురును కొనుగోలు చేయడానికి కొన్ని రిఫైనరీలు సుముఖత వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఐదో వంతు మాత్రమే ఆంక్షలు లేని సంస్థల నుంచి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గాజ్‌ప్రామ్ నెఫ్ట్, సర్గుట్‌నెఫ్టెగాస్ వంటి ఇతర రష్యా చమురు సంస్థలపై కూడా ఇప్పటికే ఆంక్షలు ఉన్నాయి. ఈ కారణంగా భారతీయ రిఫైనరీలు పశ్చిమాసియా లాంటి ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ ముడి చమురు కొనుగోలు చేయడం ప్రారంభించాయి. ఇప్పుడు ఈ భారీ తగ్గింపు ఆఫర్ వల్ల మళ్లీ రష్యా చమురు వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.



# ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్లుగా రాజాసాబ్

## పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి..

ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి ది రాజాసాబ్ ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ది రాజాసాబ్. తాజాగా ఈ సినిమా నుంచి రెబల్ సాబ్ అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ ది రాజా సాబ్ సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట రెబల్ సాబ్‌ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది. ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు. మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు. రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. నేను ప్రస్తుతం రెబెల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నా అంటూ చెప్పుకొచ్చాడు.




# ఇండస్ట్రీలో 95% మంది జీవితాలు సాదాసీదానే..

## నటుడు శివాజీ

ఇండస్ట్రీలో 95% మంది సాదాసీదా జీవితమే గడుపుతున్నారని నటుడు శివాజీ అన్నారు. తాజాగా జరుగుతోన్న పరిణామాలపై ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. పైరసీ వెబ్‌సైట్ నిర్వాహకులు ఐబొమ్మ రవి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. మన దేశంలోని చట్టాలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే కచ్చితంగా శిక్ష అనుభవిస్తారని తెలిపారు. "ఇండస్ట్రీలో అందరూ లగ్జరీ లైఫ్ గడుపుతున్నారనేది వాస్తవం కాదు. పరిశ్రమలో 95 శాతం మంది సాదాసీదా జీవితాన్ని గడపుతున్నారు. 5 శాతం మంది మాత్రమే లగ్జరీగా జీవిస్తున్నారు. వాళ్లను చూసి ఇండస్ట్రీ మొత్తాన్ని నిందించడం సరైన పద్ధతి కాదు. అందరూ థియేటర్లలో టికెట్ ధరలు పెరిగాయని విమర్శిస్తున్నారు. సంక్రాంతి సమయంలో, పెద్ద పెద్ద పండగలప్పుడు బస్సు టికెట్ ధరలు మూడింతలు పెరుగుతాయి. దాని గురించి ఎవరూ మాట్లాడరు. సినిమా టికెట్ ధర రూ.100 పెరిగినా అందరూ ఇండస్ట్రీని విలన్‌గా చూపిస్తారు" అని అసహనం వ్యక్తంచేశారు. కంటెంట్ బాగుంటే చిన్న సినిమాలను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని శివాజీ అన్నారు. థియేటర్‌లలో అమ్మే పాప్‌కార్న్‌లు ఆరోగ్యానికి మంచివి కాదని వాటిని తినొద్దని సూచించారు.



# కృతి ప్రేమపాట


'డ్యూడ్'గా ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎల్ఐకే'. విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించారు. కృతి శెట్టి కథానాయికగా నటించింది. భారీ బడ్జెట్‌తో టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తీర్చిదిద్దిన చిత్రమిది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన మొదటి గీతం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. తాజాగా మరో పాటను ఈ నెల 27న తీసుకురాబోతున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది చిత్రబృందం. ఇందులో కృతి, ప్రదీప్‌ల మధ్య కెమిస్ట్రీ, ప్రేమ ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఎస్‌జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. డిసెంబరు 18న థియేటర్లలోకి రాబోతుందీ సినిమా.

# చికిరి చికిరి పాటకు 100 మిలియన్ వ్యూస్



విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది పెద్ది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన చికిరి చికిరి పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.

# నటి శ్రద్ధాకపూర్‌కు గాయం



నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం ఈతాలో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని చెప్పారు.

# ఫిబ్రవరి 13న స్వయంభు విడుదల

## భారీ అంచనాలతో నిర్మాణం

ఒక సినిమా.. రెండు సంవత్సరాల కష్టం.. పదుల సంఖ్యలో సెట్స్.. వేల సవాళ్లు.. అంటూ స్వయంభు విడుదల తేదీని ప్రకటించారు హీరో నిఖిల్. ఆయన ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న విడుదల కానున్నట్లు తెలుపుతూ వీడియో విడుదల చేశారు. హీరో నిఖిల్ సిద్దార్థ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పీరియడ్ వార్ యాక్షన్ డ్రామా స్వయంభు మరోసారి వార్తల్లోకి వచ్చింది. కొంతకాలంగా చిత్ర బృందం నుంచి ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహంలో ఉన్నారు. అయితే , ఈ రోజు మేకర్స్ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. కార్తికేయ 2తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిఖిల్ ఇప్పుడు మళ్లీ పాన్ వరల్డ్ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మొదటిసారి దర్శకుడిగా మారుతున్న భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా వచ్చే ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది.

తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషలలో మూవీని రిలీజ్ చేయనున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని టీమ్ వెల్లడించింది. విడుదల తేదీ ప్రకటించిన సందర్భంగా, మేకర్స్ రైజ్ ఆఫ్ స్వయంభు అనే స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో చిత్రంలోని భారీ స్కేల్, యుద్ధ సన్నివేశాలు, పీరియడ్ సెట్లు, నిఖిల్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియోతో చిత్రం పై ఉన్న హైప్ మరింత పెరిగింది. త్వరలో ప్రమోషన్లు పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రంలో సమ్యుక్తా, నభా నటేష్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఇద్దరి పాత్రలు కూడా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్టు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత టాగూర్ మధు ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ కె.కె. సెంథిల్ కుమార్ కాగా, ఇప్పటికే భారీ చిత్రాలకు కెమెరా వర్క్ అందించిన ఆయన విజువల్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. యుద్ధ నేపథ్యం, భారీ సెట్స్, ఇంటెన్స్ కథ, పాన్‌వరల్డ్ విడుదల ..ఈ అంశాలన్నీ కూడి స్వయంభును నిఖిల్ కెరీర్‌లో అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. విడుదల తేదీ అనౌన్స్‌మెంట్ తర్వాత పోస్టర్లు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2026 ఫిబ్రవరి వరకు కొత్త అప్డేట్లు, పోస్టర్లు, ట్రైలర్లు వరుసగా విడుదలయ్యే అవకాశం ఉంది.




# కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి



ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో మన శంకర వరప్రసాద్‌గారు సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.

# సంక్రాంతి రేసు నుంచి తప్పకున్న నవీన్ పోలిశెట్టి?



యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచా రం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా రాజుగారు రావడం లేదని తెలుస్తోంది. చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి లైన్ లో ఉన్నాయి. ఇక ఇన్ని సినిమాలతో పోటీ తట్టుకోలేక రాజుగారు డ్రాప్ అయ్యారని, సంక్రాంతి రేసు నుంచి నవీన్ తప్పుకున్నాడని వార్తలు వస్తున్నాయి. అందుకే ప్రమోషన్స్ కూడా మధ్యలోనే ఆపేశారని సమాచారం. త్వరలోనే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా తెలపనున్నారట. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com